www.aashwi.net / in PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

## తగ్గిన బంగారం



6



## ద్రవిడ్ కు ఇంగ్లండ్ కోచ్ అవకాశం

8

మంగళవారం, 13-07-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :75 Issue : 75 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in



## కాళేశ్వరం డిజైన్‌పై కాంగ్రెస్ సర్కార్ ఫైర్!

- సమ్మక్క సాగర్, దేవాదుల ప్రాజెక్టులను మంత్రుల బృందం పరిశీలించింది
- సమ్మక్క బ్యారేజ్ నుండి దేవాదుల 7 మోటార్ల ద్వారా గోదావరి జలాలు ఎత్తిపోస్తున్నారు.
- ప్రమాదం ఉన్నందునే మేడిగడ్డ గేట్లు మూయడం లేదని, డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికనే పాటిస్తామని భట్టి చెప్పారు.
- రాష్ట్రంలోని 22 రిజర్వాయర్ల కోసం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసినట్లు పొంగులేటి తెలిపారు.

2

## సింగరేణిలో దుస్థితికి కారణం కాంగ్రెస్, బీఆర్ఎస్ లే : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

- గత ప్రభుత్వం సంస్థకు రూ.24 వేల కోట్ల విద్యుత్ బకాయిలు పెట్టింది
- మోదీ ప్రభుత్వం వేలం లేకుండా 'తాడిచర్ల-2' బొగ్గు బ్లాక్ కేటాయించింది
- ఒడిశాలోని 'నైనీ' కోల్ బ్లాక్‌ను కూడా కేంద్ర ప్రభుత్వమే ఇచ్చింది

**భద్రాద్రి కొత్తగూడెం, ఆశ్వి అప్డేట్స్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించిన బీజేపీ 'సింగరేణి భరోసా యాత్ర'లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు. సింగరేణి సంస్థ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రస్తావిస్తూ.. గత ప్రభుత్వాల వైఖరిపై మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో అప్పటి ప్రధాని

మిగతా 2వ పేజీలో..



## రేవంత్ కేవలం ఉద్యమ ద్రోహే కాదు.. జలద్రోహి కూడా..


- సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో కాంగ్రెస్‌పై విమర్శలు
- చంద్రబాబుతో కుమ్మక్కయ్యారంటూ ఆరోపణలు
- బనకచర్లపై అసెంబ్లీలో చర్చ కోరిన బీఆర్ఎస్
- సమ్మక్క బ్యారేజీపై భట్టికి హరీష్ సవాల్



2

## షాబాద్ ఉన్మాది రాజ్‌కుమార్ ఆత్మహత్య!

- కొత్తూరు మండలం పంజర్లలో శవమై తేలిన నిందితుడు
- పోలీసులకు దొరకకుండా బలవన్మరణం



3




# తెలంగాణ ప్రయోజనాలే అజెండా.. పార్లమెంట్‌లో సమష్టిగా పోరాడాలి

- రాజకీయాలకు అతీతంగా ఎంపీలంతా కలిసి పార్లమెంట్‌లో తెలంగాణ హక్కుల కోసం పోరాడాలి.
- హైదరాబాద్‌కు ఐఐఎం (IIM), మెట్రో ఫేజ్-2 మరియు రీజనల్ రింగ్ రోడ్డు (RRR) అనుమతులు సాధించాలి.
- గోదావరి-కావేరి అనుసంధానం, తుంగభద్ర నీటి వాటా మరియు జల వివాదాలను పరిష్కరించుకోవాలి.
- శంషాబాద్ బుల్లెట్ రైలు, వరంగల్-ఆదిలాబాద్ విమానాశ్రయాల అభివృద్ధికి కేంద్ర నిధులు తేవాలి.

**హైదరాబాద్, జూలై 13, ఆశ్వి అప్డేట్స్:**

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, దీర్ఘకాలిక ప్రయోజనాల విషయంలో రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు ఏకతాటిపై నిలిచి పనిచేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ అంశాలను కేంద్రం దృష్టికి బలంగా తీసుకెళ్లాలని, తెలంగాణ

మిగతా 3వ పేజీలో..





## దక్షిణ తెలంగాణకు రూ.1,271 కోట్ల రహదారుల వరం

- దక్షిణ తెలంగాణకు రహదారుల వరం: రూ. 1,271 కోట్ల భారీ నిధుల కేటాయింపు
- మక్తల్, గద్వాల, వనపర్తిలలో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (HAM) రోడ్లకు శంకుస్థాపన
- అత్యున్నత నాణ్యతతో రహదారుల నిర్మాణం; నిర్వహణ బాధ్యత కాంట్రాక్టర్‌దే: మంత్రి కోమటిరెడ్డి




3

## సిరిసిల్ల మున్సిపల్‌లో అసలేం జరుగుతోంది..?

- ఇందిరమ్మ ఇళ్లు, ఎల్ఈడీ షాప్ కోసం వైస్ చైర్మన్ లంచం డిమాండ్ చేశారని కేసు నమోదైంది.
- పార్టీ ఆఫీస్‌లో మాజీ మంత్రి కేటీఆర్‌తో మున్సిపల్ కమిషనర్ సమావేశమవడం వివాదంగా మారింది

2





## పోలవరం బనకచర్లకు తెరచాటు సహకారం..

- సీఎం రేవంత్‌పై కవిత సంచలన ట్వీట్
- లోపభూయిష్ట పిటిషన్ వల్ల ఏపీ ప్రాజెక్టుపై నోటీసులు ఇవ్వడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది.
- ఏపీ సీఎంతో రేవంత్ రెడ్డి కుమ్మక్కు కావడం వల్లే కోర్టులో బలహీనంగా వాదించారని ఆరోపణ.
- రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ గోదావరి నీటి హక్కులను తాకట్టు పెట్టారని విమర్శ.
- వెంటనే సుప్రీంలో పటిష్ట పిటిషన్ వేయాలని, లేదంటే తెలంగాణ ప్రజలు క్షమించరని హెచ్చరిక

3

## ఇంజినీర్లకు సీఎం వెంటనే క్షమాపణ చెప్పాలి: ఎంపీ ఈటల రాజేందర్



- ఇంజినీర్లను కించపరిచినందుకు సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.
- మేడిగడ్డ పిల్లర్లు కుంగిన ఘటనపై విచారణ జరిపి తప్పు చేసిన ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు లేదా నాటి పాలకులను శిక్షించాలన్నారు.
- భేషజాలకు పోకుండా కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీటిని తరలించి తెలంగాణ రైతాంగాన్ని ఆదుకోవాలని సూచించారు.
- కరువు, కరెంట్ సమస్యలు రాకుండా ఉండాలంటే రోజుకు 3 టీఎంసీల నీటిని వెంటనే ఎత్తిపోయాలని రిటైర్డ్ ఇంజినీర్లు కోరారు.

**తెలంగాణ బ్యూరో, ఆశ్వి అప్డేట్స్:**

కాళేశ్వరం ప్రాజెక్టు వివాదంలో బీఆర్ఎస్ నేతలు, రిటైర్డ్ ఇంజినీర్లను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని, అహంకారంతో నోటికి ఏది వస్తే అది మాట్లాడటం మానుకోవాలని ఎంపీ ఈటల రాజేందర్ హెచ్చరించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ ఫోరమ్ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'ఖబర్దార్ రేవంత్ రెడ్డి! పదవి ఉందనే అహంకారంతో మాట్లాడితే చూస్తూ ఊరుకోం. ప్రాజెక్టుల

మిగతా 2వ పేజీలో..

# కాళేశ్వరం డిజైన్‌పై కాంగ్రెస్ సర్కార్ ఫైర్!

**తెలంగాణ, ఆశ్వి అప్డేట్స్**



ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమక్క సాగర్ ప్రాజెక్టును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. హెలికాప్టర్‌లో అక్కడికి చేరుకున్న మంత్రులకు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ లెనిన్ వస్సల్ టోప్పో ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత సమక్క బ్యారేజ్, దేవాదుల ప్రాజెక్టు పనులను పరిశీలించిన మంత్రులు గోదావరి జలాల వినియోగం, కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్ పరిస్థితిపై కీలక వ్యాఖ్యలు చేశారు.

**గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగిస్తాం: భట్టి విక్రమార్క**

కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గోదావరి జలాలను సాధ్యమైనంత మేర వినియోగించుకోవాలని నిర్ణయించిందన్నారు. సమక్క బ్యారేజ్‌లో గేట్లు మూసివేయడం వల్ల 71 మీటర్ల ఎత్తులో నీటి నిల్వలు ఉన్నాయని, అందువల్ల దేవాదుల ప్రాజెక్టు ద్వారా 7 మోటార్లతో నీటిని ఎత్తిపోస్తున్నామని చెప్పారు. కన్నెపల్లి పంప్‌హౌస్ ఎందుకు పనిచేయడం లేదని ప్రశ్నించే వారికి వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. మేడిగడ్డ వద్ద గేట్లు మూసివేస్తే బ్యారేజ్‌కు ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరించారని, వారి సూచనలను పాటిస్తున్నామని తెలిపారు. పారే నీటినే ఎత్తుకునే అవకాశం ఉంటే మూడు బ్యారేజీలు ఎందుకు నిర్మించారో మాజీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికల ఆధారంగానే ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు.

**22 రిజర్వాయర్లకు యాక్షన్ ప్లాన్: పొంగులేటి**


మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 22 రిజర్వాయర్ల కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని వెల్లడించారు. సమక్క బ్యారేజ్‌లో నీటిని నిల్వ చేస్తే పంపింగ్ సులభమవుతుందని చెప్పారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం నుంచి ప్రవహించే నీటిని పంపింగ్ చేసే అవకాశం ఉన్నప్పుడు భారీ బ్యారేజీల నిర్మాణం ఎందుకు చేపట్టారో మాజీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, ఇంజినీర్ల సూచనల మేరకే ప్రభుత్వం వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. గతంలో నిర్మించిన అనేక డ్యామ్‌లు సురక్షితంగా ఉండగా.. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన బ్యారేజీలు మాత్రం నాణ్యత సమస్యలతో నిలిచిపోయాయని ఆరోపించారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా సాగు, తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

**మేడిగడ్డ వద్ద నీరు నిల్వ చేస్తే ప్రమాదం: ఉత్తమ్ కుమార్ రెడ్డి**

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. కాళేశ్వరం నీటిని ఉపయోగించకుండానే గత ఏడాది 84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని చెప్పారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లో నాణ్యత లోపాలు ఉన్నాయని నిపుణుల కమిటీ ఇప్పటికే నివేదించిందని తెలిపారు. మేడిగడ్డ వద్ద నీటిని నిల్వ చేయొద్దని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ గత ప్రభుత్వ హయాంలోనే సూచించిందని గుర్తుచేశారు. డిజైన్ మార్పులు, నాణ్యతా లోపాల కారణంగానే ప్రస్తుతం ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. మేడిగడ్డపై ఐఐటీ బాంబే నిపుణులతో పాటు సైన్యం సహకారంతో సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తున్నామని.. మరమ్మతులకు అవసరమైన నివేదికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. దేవాదుల ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇచ్చి పనులు పూర్తి చేస్తున్నామని, ప్రస్తుతం 7 పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నామని చెప్పారు.

# సిరిసిల్ల మున్సిపల్‌లో అసలేం జరుగుతోంది..?

**రాజన్న సిరిసిల్ల , ఆశ్వి అప్డేట్స్:**




జిల్లాలోని సిరిసిల్ల మున్సిపాలిటీ గత కొద్ది రోజులుగా రాజకీయ, పరిపాలనా చర్చలకు కేంద్రబిందువుగా మారింది. ఒకవైపు మున్సిపల్ వైస్ చైర్మన్‌పై వరుసగా వెలుగులోకి వస్తున్న ఆరోపణలు, మరోవైపు ఇప్పటికే నమోదైన పోలీసు కేసు, తాజాగా ప్రజావాణిలో మరో ఫిర్యాదు, ఇదే సమయంలో మాజీ మంత్రి కేటీఆర్‌తో మున్సిపల్ కమిషనర్ సమావేశమైనట్లు జరుగుతున్న ప్రచారం... ఈ పరిణామాలన్నీ కలిపి సిరిసిల్ల మున్సిపల్‌లో అసలు ఏం జరుగుతోందనే ప్రశ్నను తెరపైకి తీసుకొచ్చాయి.

**ఒకటి కాదు... రెండు ఫిర్యాదులు..**

మొదట ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానంటూ రూ.1 లక్ష డిమాండ్ చేశారని ఆరోపిస్తూ ఓ మహిళ జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మున్సిపల్ కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆ కేసు దర్యాప్తు కొనసాగుతుండగానే, తాజాగా సోమవారం మరో వ్యక్తి ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తూ, పట్టణంలో ఎల్ఈడీ షాప్ ఏర్పాటు చేసుకోవడానికి రూ.5 లక్షలు డిమాండ్ చేశారని ఆరోపించారు. తక్కువ వ్యవధిలో ఒకే ప్రజాప్రతినిధిపై రెండు వేర్వేరు ఆరోపణలు రావడం ఇప్పుడు సిరిసిల్ల రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారింది. కాగా ఒక ప్రజాప్రతినిధిపై వరుసగా ఆరోపణలు రావడం వెనుక అసలు కారణాలేమిటి..? నిజంగానే అవినీతి జరిగిందా..? లేక రాజకీయంగా లక్ష్యంగా చేసుకొని ఫిర్యాదులు చేస్తున్నారా..? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అధికార, ప్రతిపక్ష వర్గాలు తమదైన కోణంలో ఈ పరిణామాలను విశ్లేషిస్తున్నాయి. అయితే ఈ ప్రశ్నలకు సమాధానం దర్యాప్తు పూర్తయిన తర్వాతే లభించనుంది.

**రహస్య భేటీపై పెరుగుతున్న సందేహాలు..**

ఈ పరిణామాల మధ్య మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో మున్సిపల్ కమిషనర్‌తో సమావేశమైనట్లు ప్రచారం జరగడం మరింత చర్చకు దారి తీసింది. ఆ సమావేశంలో బీఆర్ఎస్‌కు చెందిన ముఖ్య నాయకులు కూడా ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా కేటీఆర్ అధికారిక పర్యటన షెడ్యూల్‌లో సిరిసిల్ల కార్యక్రమం లేకపోయినా, తెలంగాణ భవన్‌కు రావడం, అక్కడ కమిషనర్‌తో సమావేశమైనట్లు వార్తలు రావడం పలు అనుమానాలకు తావిస్తోంది. పట్టణ అభివృద్ధి లేదా పరిపాలనా అంశాలపై చర్చించాల్సి వస్తే అధికారిక వేదిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాకుండా పార్టీ కార్యాలయంలో ఎందుకు సమావేశమయ్యారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే ఈ సమావేశంపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక వివరణ వెలువడలేదు. కాగా గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకం లో భాగంగా పంపిణీ చేసిన ఇండ్లలో కూడా చాలామంది కౌన్సిలర్లు చేతివాటం ప్రదర్శించారని గతంలో ఆరోపణలు ఉండగా, వాటిని కప్పిపుచ్చుకోవడానికి ఈ రహస్య భేటీలు అధికారులతో మంతనాలు జరుగుతున్నాయా అన్న విమర్శలు కూడా వినపడుతున్నాయి.


**మున్సిపల్ పాలనపై పడుతున్న ప్రభావం..**

వరుస ఆరోపణలు, కేసులు, రాజకీయ ప్రచారాల మధ్య మున్సిపల్ పరిపాలనపై కూడా ప్రభావం పడుతుందా అనే ఆందోళన వ్యక్తమవుతోంది. అభివృద్ధి పనులు, ప్రజా సేవలు, పాలనా వ్యవస్థపై ఈ వివాదాల ప్రభావం ఎలా ఉంటుందన్నది ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే ప్రస్తుతం వినిపిస్తున్న ఆరోపణలు, ప్రచారాలు, రాజకీయ వ్యాఖ్యలు ఎంత తీవ్రంగా ఉన్నా, వాస్తవాలు మాత్రం అధికారిక విచారణ ద్వారానే బయటపడతాయి. పోలీసు దర్యాప్తు, సంబంధిత అధికారుల పరిశీలన అనంతరం మాత్రమే ఆరోపణల్లో నిజానిజాలు తేలనున్నాయి. అప్పటి వరకు సిరిసిల్ల మున్సిపాలిటీ చుట్టూ రాజకీయ వేడి మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం అందరి దృష్టి ఒకటే... దర్యాప్తు ఏం తేలుస్తుంది? వరుస ఆరోపణల వెనుక వాస్తవం బయటపడుతుందా? లేక ఇవన్నీ రాజకీయ ఆరోపణలుగానే మిగిలిపోతాయా? అన్నది ఇప్పుడు సిరిసిల్లలో హాట్ టాపిక్‌గా మారింది.

# రేవంత్ కేవలం ఉద్యమ ద్రోహే కాదు.. జలద్రోహి కూడా..

- **సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో కాంగ్రెస్‌పై విమర్శలు**
- **చంద్రబాబుతో కుమ్మక్కయ్యారంటూ ఆరోపణలు**
- **బనకచర్లపై అసెంబ్లీలో చర్చ కోరిన బీఆర్ఎస్**
- **సమ్మక్క బ్యారేజీపై భట్టికి హరీష్ సవాల్**

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్**



రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు సుప్రీంకోర్టు సాక్షిగా బయటపడ్డాయని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మొదటి నుంచి రాజకీయ కాంక్ష తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవని ధ్వజమెత్తారు. తన రాజకీయ గురువు (చంద్రబాబు) కి గురుప్రదక్షిణ చెల్లించుకునేందుకే సీఎం రేవంత్ ఆరాటపడుతున్నారని విమర్శించారు. గోదావరి, నల్లమల కేసులో సుప్రీంకోర్టు ఇవాళ రాష్ట్ర ప్రభుత్వానికి గట్టి మొట్టికాయలు వేసిందని, కావాలనే లోపాలతో కూడిన కేసును వేయడం వల్లే ఈ కేసు నిలువదని ఉన్నత న్యాయమూర్తులు చెప్పారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏదో చేస్తున్నట్లు చూపించుకోవడానికి కేవలం బ్యాక్ డేట్ ఉత్తరాలు రాసిందని ఎద్దేవా చేశారు.

**చంద్రబాబుతో రేవంత్ అంతర్గత ఒప్పందం**

గోదావరి బనకచర్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని మొదటి నుంచి బీఆర్ఎస్ మొత్తుకుంటూనే ఉందని హరీష్ రావు తెలిపారు. “చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కు అయ్యారని చెప్పడానికి ఇంకేం ఆధారాలు కావాలి? ‘నువ్వు కొట్టినట్టు చెయ్.. నేను తిట్టినట్టు చేస్తా’ అన్నట్లుగా రేవంత్ డ్రామాలు ఆడుతున్నారు. రేవంత్ కేవలం ఉద్యమ ద్రోహినే కాదు, తెలంగాణకు జలద్రోహిగా కూడా మారిపోయారు” అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బనకచర్లపై సమావేశానికి వెళ్లనని చెప్పిన రేవంత్, ఆ తర్వాత దొంగచాటుగా వెళ్లారని ఆరోపించారు. పైగా చంద్రబాబుకు అత్యంత నమ్మకస్తుడైన, తెలంగాణ ద్రోహి అయిన ఆదిత్యనాథ్ దాస్‌ను కమిటీలో ఎలా నియమిస్తారని నిలదీశారు. రేవంత్ రెడ్డికి జల వనరులపై అవగాహన తక్కువ, ఆవేశం ఎక్కువ అని హరీష్ రావు ఎద్దేవా చేశారు.

**తెలంగాణ ప్రయోజనాలను ఏపీకి అమ్ముకుంటున్నారు**

గోదావరి నల్లమల సాగర్‌పై ఆంధ్రప్రదేశ్ టెండర్లను 11 డిసెంబర్ 2025 నాడే పూర్తి చేసిందని, దానిపై కాంగ్రెస్ ప్రభుత్వం 16 డిసెంబర్ 2025న రిట్ పిటిషన్ వేసిందని హరీష్ రావు గుర్తుచేశారు. అది డిస్మిస్ అయిన తర్వాత గత 7 నెలలుగా ఈ ప్రభుత్వం ఏం చేస్తూ తమాషాలు చేస్తోందని ప్రశ్నించారు. నిన్న మొన్నటి వరకు రివ్యూలు చేయాల్సిన పాలకులు, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బీఆర్ఎస్‌పై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. కర్ణాటకలో ముగ్గురు సీఎంల అజెండా ఏంటో రేవంత్ రెడ్డి బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ‘ఎన్‌ఓసీ’ పేరిట తెలంగాణ ప్రయోజనాలను రేవంత్ ఏపీకి అమ్ముకుంటున్నారని, దీనిపై అసెంబ్లీని సమావేశపరిచి చర్చ జరపాలని, దొంగచాటుగా వ్యవహారాలు నడిపితే తాము ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. బనకచర్ల విషయంలో రేవంత్ తీరు అనుమానాస్పదంగా ఉందని, అందుకే ఇవాళ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆ సమావేశానికి వెళ్లలేదని పేర్కొన్నారు.

**భట్టి గారూ.. సమ్మక్క బ్యారేజీ ఎవరు కట్టారో చెప్పండి..**

బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో గట్టిగా ప్రశ్నించడం వల్లే ప్రభుత్వం దిగివచ్చి దేవాదుల మోటర్లను ఆన్ చేసిందని హరీష్ రావు స్పష్టం చేశారు. అయితే అక్కడ కూడా 2500 క్యూసెక్కుల నీటిని ఎత్తాల్సి ఉండగా, కేవలం 6 మోటర్లను మాత్రమే నడుపుతున్నారని విమర్శించారు. సమ్మక్క బ్యారేజీలో నీరు నిల్వ చేసుకుంటే పంపింగ్ చేసుకోవచ్చని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చాలా ముద్దుగా చెబుతున్నారని హరీష్ రావు ఎద్దేవా చేశారు. అసలు ఆ సమ్మక్క బ్యారేజీని నిర్మించింది ఎవరో భట్టి విక్రమార్క సమాధానం చెప్పాలని, కేసీఆర్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులను వాడుకోవడం కూడా చేతకాక కాంగ్రెస్ నేతలు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు.

# సింగరేణిలో దుస్థితికి కారణం కాంగ్రెస్, బీఆర్ఎస్ లే : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి**



మన్మోహన్ సింగ్ ప్రభుత్వ కాలంలో దేశంలో అతిపెద్ద బొగ్గు కుంభకోణం జరిగిందని కిషన్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన బొగ్గు గనుల కేటాయింపులను సుప్రీంకోర్టు రద్దు చేసిందని, అనంతరం బొగ్గు గనుల కేటాయింపులు పారదర్శకంగా జరగాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం వేలం ప్రక్రియ లేకుండా సింగరేణికి కేటాయించిన ఏకైక బొగ్గు గని తాడిచర్ల2 బ్లాక్ అని తెలిపారు. ఈ బ్లాక్‌లో గ్రేడ్ 8 నాణ్యమైన బొగ్గు లభిస్తుందని, మరో 40 నుంచి 50 సంవత్సరాల పాటు సింగరేణికి అవసరమైన బొగ్గు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. తాడిచర్ల2 బ్లాక్‌ను సింగరేణికి కేటాయించిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ కూడా మోదీ ప్రభుత్వమే సింగరేణికి కేటాయించిందని గుర్తుచేశారు. సింగరేణి సమస్యలపై తాను అనేక సార్లు ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లానని, సంస్థకు మరిన్ని బొగ్గు బ్లాకులు అవసరమని కేంద్రానికి వివరించానని చెప్పారు. ప్రస్తుతం సింగరేణి ఎదుర్కొంటున్న పరిస్థితులకు బీఆర్ఎస్ ప్రభుత్వమే పూర్తిగా బాధ్యత వహించాలని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అహంకారపూరిత నిర్ణయాలు, సింగరేణిని కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవడమే సంస్థ పరిస్థితి దిగజారడానికి కారణమని విమర్శించారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి చేసిన మేలు ఏమిటో ప్రజలకు చెప్పాలని కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ కేటాయింపుపై కేసీఆర్ ఎప్పుడూ మాట్లాడలేదన్నారు. సింగరేణికి ఇవ్వాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు.

సింగరేణి నుంచి తీసుకున్న బొగ్గు, విద్యుత్ బకాయిలను చెల్లించకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ.24 వేల కోట్ల అప్పు పెట్టిందని ఆరోపించారు. రాష్ట్రంలో 49 శాతం వాటా ఉన్నప్పటికీ బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణి అభివృద్ధి కోసం కేంద్రాన్ని సమర్థవంతంగా సంప్రదించలేదని, ఈ రెండు పార్టీలు సింగరేణిని రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగించుకున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు.

# ఇంజినీర్లకు సీఎం వెంటనే క్షమాపణ చెప్పాలి: ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్

**మొదటిపేజీ తరువాయి**

నిర్మాణం కోసం రాత్రింబగళ్లు కష్టపడిన ఇంజినీర్లను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, వారికి బహిరంగ క్షమాపణ చెప్పాలి’అని డిమాండ్ చేశారు.

2023లో లక్ష్మీ బ్యారేజ్ వద్ద రెండు పిల్లర్లు కుంగిపోయాయి. డిజైన్ల తప్పుంటే విచారణ చేసి ఇంజినీర్లను, క్వాలిటీలో లోపాలు ఉంటే ఆ కాంట్రాక్టర్‌ను, అలాగే ఎవరి సలహా పట్టించుకోకుండా నాటి పాలకులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుని ఉంటే నాటి పాలకులను బాధ్యులను చేసి శిక్ష వేయాలన్నారు. కాగితాలకే పరిమితమైన ఎస్సారెస్పీ ఆయకట్టులో రెండు పంటలు పండాయి. మేడిగడ్డ కూలిపోయింది, అన్నారం, సుందిళ్ల పనికిరావని సీఎం రేవంత్‌రెడ్డి అనడం సరికాదన్నారు. ఎన్డీఎస్ఏ పేరు చెప్పి తప్పించుకుంటున్న ముఖ్యమంత్రి ఇక్కడి రిటైర్డ్ ఇంజినీర్లు, సాగునీటి నిపుణుల సూచనలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. బ్యారేజీతో సంబంధం లేకుండా కన్నెపల్లి నుంచి నీళ్లు తీసుకోవచ్చని ఇంజినీర్లు సూచిస్తున్నా, ముఖ్యమంత్రి భేషజాలకు పోతూ తెలంగాణ రైతాంగం నోట్లో మట్టికొట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపారు. అనంతరం రిటైర్డ్ ఇంజనీర్లు దామోదర్ రెడ్డి, వెంకటేశం, శ్రీధర్ దేశ్ పాండే, వెంకట రామారావులు మాట్లాడుతూ... ప్రస్తుతం ఎల్‌నీనో ప్రభావంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ప్రాజెక్టుల్లో నిల్వ ఉన్న నీళ్లు డెడ్ స్టోరేజీకి చేరాయన్నారు. రాబోయే రోజుల్లో తాగునీటికి, పరిశ్రమలకు నీళ్లు కావాలంటే ముఖ్యమంత్రి తాము చేసిన సూచనలే కాదు, కేంద్ర ప్రభుత్వ నిపుణుల సలహాలు తీసుకుని అయినా నీళ్లను ఎత్తిపోయాలన్నారు. రోజుకు 3 టీఎంసీలు ఎత్తిపోసుకునే వెసులుబాటు, అందుకు కావాల్సిన యంత్రాంగం అంతా సిద్ధంగా ఉందన్నారు. గోదావరిలో ప్రాణహిత వద్దనే నీటి లభ్యత ఉంటుందని సీడబ్ల్యూసీ కూడా పేర్కొన్నదని వారు గుర్తుచేశారు. మేడిగడ్డ నింపితే కూలిపోతుందని, భద్రాచలం మునిగిపోతుందని ముఖ్యమంత్రి భయపెట్టే ప్రకటనలు చేస్తున్నారని, ఆ వాదనలు తప్పన్నారు. ప్రస్తుతం వస్తున్న వరదల కంటే రెట్టింపు స్థాయిలో నీళ్లు వచ్చినా ఏమీ కాలేదని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి రైతాంగాన్ని దృష్టిలో పెట్టుకుని నీళ్లను ఎత్తిపోయాలన్నారు. లేకపోతే కరెంటు సమస్యలు కూడా తలెత్తుతాయన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక నిపుణులు పి. పాపారావు, బీజేపీ నేత వేణుగోపాల్ రెడ్డి, బీఆర్ఎస్ నేత చిరుమల్ల రాకేష్, సీనియర్ జర్నలిస్టులు గొర్ల బుచ్చన్న, ఎ. రమణ కుమార్, నర్రా విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# 4×400 రిలేలో స్వర్ణం.. తెలంగాణ కీర్తిని చాటిన ప్రవళిక: సీఎం రేవంత్ విషెస్

**తెలంగాణ బ్యూరో, ఆశ్వి అప్డేట్స్:**

చైనాలోని ఒర్డోస్‌లో జరుగుతున్న తొలి ఏషియా అండర్ 23 అథ్లెటిక్ చాంపియన్‌షిప్ 2026లో మహిళల 4x400 రిలే పరుగు పందెంలో స్వర్ణ పతకం సాధించిన నారిమళ్ల ప్రవళికకు సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. తెలంగాణ బిడ్డ ప్రవళిక నారిమళ్ల ఆసియా అండర్ 23 అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్స్‌లో అసమాన ప్రతిభ కనబరిచి మహిళల 4x400 మీటర్ల రిలేలో ఆమె స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నారు. నల్గొండలోని ఎస్సీ గురుకుల డిగ్రీ కాలేజీలో చదువుతూ, డిండి గురుకుల స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొంది అంతర్జాతీయ వేదికపై రాణించిన ప్రవళిక యువ క్రీడాకారులు అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారని ప్రశంసించారు.

తాపీ మేస్త్రి కూతురైన ప్రవళిక పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించారని పేర్కొన్నారు. జట్టులో ప్రవళిక, శ్రావణి సచిన్ సాంగ్లే, సాండ్రమోల్ సాబు, నోఫిసా ఖతూన్‌లతో కలిసి స్వర్ణ పతకం సాధించారు. ఈ నలుగురు సభ్యుల బృందం 3:33.62 సెకన్ల సమయంతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుని, ఆతిథ్య దేశమైన చైనాను అధిగమించింది. అంతర్జాతీయ స్థాయికి చేరుకోవడానికి ముందే, ప్రవళిక వివిధ వేదికల్లో 23 స్వర్ణాలతో సహా మొత్తం 35 రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించి అద్భుతమైన దేశీయ రికార్డును నెలకొల్పారు. ఈ చాంపియన్‌షిప్‌లో మొత్తంగా 3 స్వర్ణ, 4 రజత, 9 కాంస్య పతకాలతో సహా 16 పతకాలను సాధించిన భారత క్రీడాకారులు అందరికీ ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.





# దక్షిణ తెలంగాణకు రూ.1,271 కోట్ల రహదారుల వరం

- దక్షిణ తెలంగాణకు రహదారుల వరం: రూ. 1,271 కోట్ల భారీ నిధుల కేటాయింపు
- మక్తల్, గద్వాల, వనపర్తిలలో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (HAM) రోడ్లకు శంకుస్థాపన
- అత్యున్నత నాణ్యతతో రహదారుల నిర్మాణం; నిర్వహణ బాధ్యత కాంట్రాక్టర్‌దే: మంత్రి కోమటిరెడ్డి
- మెరుగైన రవాణా సౌకర్యాలతో పెరగనున్న పెట్టుబడులు, పారిశ్రామిక, వ్యవసాయ అభివృద్ధి


**మహబూబ్‌నగర్/గద్వాల/వనపర్తి, జూలై 13:**

దక్షిణ తెలంగాణలో రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్, జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్, వనపర్తి జిల్లాల్లో మొత్తం రూ.1,271.48 కోట్ల వ్యయంతో చేపట్టనున్న హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (HAM) రహదారి అభివృద్ధి పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. మక్తల్‌లో రూ.573 కోట్లు, గద్వాలలో రూ.339.39 కోట్లు, వనపర్తిలో రూ.359.09 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టులు పూర్తయితే దక్షిణ తెలంగాణలో రవాణా వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. వ్యవసాయం, పరిశ్రమలు, వ్యాపారం, గ్రామీణ కనెక్టివిటీకి ఇవి కీలకంగా మారనున్నాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ ద్వారా నిర్మాణం అనంతరం కూడా రహదారుల నిర్వహణ బాధ్యత కాంట్రాక్టర్‌కే ఉండటంతో నాణ్యతకు పూర్తి హామీ ఉంటుందని తెలిపారు. తెలంగాణలో దేశానికే ఆదర్శంగా నిలిచే రహదారుల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని, మెరుగైన రహదారులతో ప్రయాణ సమయం తగ్గడంతో పాటు పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు.

ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్న మంత్రి, నాణ్యమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ, మహిళల ఆర్థిక సాధికారత వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

మక్తల్ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. గద్వాలలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, వీర్లపల్లి శంకర్, కార్పొరేషన్ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య యాదవ్ హాజరయ్యారు. వనపర్తిలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, బియ్యాని మనోహర్ రెడ్డి, కూచుకుళ్ల రాజేష్, జి. మధుసూదన్ రెడ్డి, ఎస్‌పీ చైర్మన్ శివసేన రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

హ్యామ్ విధానంలో చేపట్టిన ఈ రహదారి ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత దక్షిణ తెలంగాణలో రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగుపడటంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి, పెట్టుబడుల ఆకర్షణకు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు మరింత ఊతం లభించనుందని అధికారులు పేర్కొన్నారు.



## ఆదిలాబాద్ సీసీఐని పునఃప్రారంభించాలి

- 15న ఢిల్లీకి బీఆర్ ఎస్ ప్రతినిధి బృందం
- కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామికి వినతిప్రతం

**హైదరాబాద్ , ఆశ్వి అప్డేట్స్:**



ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పరిశ్రమను తక్షణమే పునఃప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ప్ర తినిధి బృందం ఈ నెల 15న ఢిల్లీకి వెళ్లనుంది. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జోగు రామన్నల ఆధ్వర్యంలోని సీసీఐ సాధన కమిటీ కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామిని కలిసి పరిశ్రమ పునరుద్ధరణకు సంబంధించి ఒక వినతిపత్రాన్ని సమర్పించనుంది. ఈ ప్రతినిధి బృందానికి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు వద్దిరాజు రవిచంద్ర తో పాటు పలువురు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొంటారు. ఆదిలాబాద్ ప్రాంత ప్రజల దశాబ్దాల డిమాండ్ అయిన సీసీఐ పునఃప్రారంభంపై కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకునేలా విజ్ఞప్తి చేయడం ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని పార్టీ తెలిపింది. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పలుమార్లు ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులను కలిసి సీసీఐ పునరుద్ధరణపై విజ్ఞప్తి చేసినట్లు పేర్కొంది. అప్పటి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ కూడా పలుమార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వానికి లేఖలు సమర్పించారని, పరిశ్రమ పునరుద్ధరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన సహకారం, రాయితీలు అందించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ గత 13 ఏళ్లుగా కేంద్రం నుంచి ఎలాంటి సానుకూల నిర్ణయం రాలేదని పేర్కొంది. 2019, 2024 ఎన్నికల సమయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాతోపాటు పలువురు బీజేపీ నాయకులు ఆదిలాబాద్‌లో బీజేపీ ఎంపీని గెలిపిస్తే సీసీఐని తిరిగి ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఆ హామీని అమలు చేయకుండా ప్రభుత్వరంగ సంస్థను ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆదిలాబాద్ ప్రజల చిరకాల డిమాండ్, జిల్లా యువతకు వేలాది ఉద్యోగాలు కల్పించే సామర్థ్యం ఉన్న సీసీఐ పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పునఃప్రారంభించాలని, ఈ అంశంపై కేంద్ర మంత్రి కుమారస్వామి జోక్యం చేసుకుని సానుకూల నిర్ణయం తీసుకోవాలని బీఆర్ఎస్ ప్రతినిధి బృందం కోరనుంది.

# పోలవరం-బనకచర్లకు తెరచాటు సహకారం..

- సీఎం రేవంత్‌పై కవిత సంచలన ట్వీట్
- లోపభూయిష్ట పిటిషన్ వల్ల ఏపీ ప్రాజెక్టుపై నోటీసులు ఇవ్వడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది.
- ఏపీ సీఎంతో రేవంత్ రెడ్డి కుమ్మక్కు కావడం వల్లే కోర్టులో బలహీనంగా వాదించారని ఆరోపణ.
- రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ గోదావరి నీటి హక్కులను తాకట్టు పెట్టారని విమర్శ.
- వెంటనే సుప్రీంలో పటిష్ట పిటిషన్ వేయాలని, లేదంటే తెలంగాణ ప్రజలు క్షమించరని హెచ్చరిక.

**ఆశ్వి అప్డేట్స్**

ఏపీ సర్కార్ నిర్మించ తలపెట్టిన పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో సీఎం రేవంత్ రెడ్డి వైఖరి, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తప్పుబడుతూ టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత 'X' (ట్విట్టర్) వేదికగా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ ప్రాజెక్టుపై తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను ప్రస్తావిస్తూ ఆమె ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.

**ఏపీతో ములాఖత్ రాజకీయాలు..**

గోదావరి నదిలో తెలంగాణ (Telangana)కు ఉన్న చట్టబద్ధమైన హక్కులను కాలరాసేలా ఏపీ ప్రభుత్వం పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టును చేపడుతుంటే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెరచాటున దానికి ఎంతగా సహకరిస్తోందో ఇవాళ సుప్రీంకోర్టు (Supreme Court) ఆదేశాలను చూస్తే స్పష్టమవుతోందని కవిత ఆరోపించారు.



సీఎం రేవంత్‌కు తెలంగాణ నీటి హక్కులపై కనీస సోయి లేదని విమర్శించారు. ఏపీ కడుతున్న అక్రమ ప్రాజెక్టును అడ్డుకోవడానికి కనీసం పటిష్టమైన పిటిషన్ కూడా వేయలేదంటే, ఏపీ సీఎంతో రేవంత్ రెడ్డి జరుపుతున్న ములాఖత్ రాజకీయాలు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రజలు అర్థం చేసుకోవచ్చని కవిత అన్నారు. ఈ లింక్ ప్రాజెక్టుపై ఏపీ ప్రభుత్వానికి కనీసం నోటీసులు ఇవ్వడానికి కూడా సుప్రీంకోర్టు నిరాకరించిందని, లోపాలతో కూడిన పిటిషన్ ఆధారంగా తాము ఇంజక్షన్ ఆర్డర్ ఇవ్వలేమని కోర్టు చెప్పడాన్ని ఎత్తిచూపారు. తన రాజకీయ ప్రయోజనాల కోసం ఏపీ సీఎంకు గురుదక్షిణగా మన గోదావరి నీళ్లను రాసిస్తున్నారని ఈ బలహీనమైన పిటిషన్‌తో తేలిపోయిందని కవిత ఫైర్ అయ్యారు.

**తెలంగాణ గడ్డ క్షమించదు..**

ఏపీ తలపెట్టిన పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై ఇప్పటికైనా లోపాలు లేని అత్యంత పటిష్టమైన పిటిషన్‌ను సుప్రీంకోర్టులో దాఖలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ అక్రమ ప్రాజెక్టును న్యాయపరంగా అడ్డుకోలేకపోతే.. తెలంగాణ గడ్డ, ఇక్కడి ప్రజలు ఈ ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్ రెడ్డిని ఎన్నటికీ క్షమించరనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని కవిత వార్నింగ్ ఇచ్చారు.

## తెలంగాణ ప్రయోజనాలే అజెండా..

# పార్లమెంట్‌లో సమష్టిగా పోరాడాలి

**మొదటిపేజీ తరువాయి**

అభివృద్ధికి సంబంధించిన ప్రతి ప్రాజెక్టును సాధించే వరకు సమష్టిగా కృషి చేయాలని ఎంపీలకు పిలుపునిచ్చారు.




మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో రాష్ట్రానికి చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ముఖ్యమంత్రి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వ అనుమతులు, నిధులు అవసరమైన ప్రధాన ప్రాజెక్టులను వివరించారు. రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే ప్రాజెక్టులపై పార్లమెంట్ వేదికగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

హైదరాబాద్ దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక నగరంగా ఎదిగిందని, దేశ జీడీపీలో గణనీయమైన వాటా కలిగి ఉన్నప్పటికీ ఇప్పటికీ భారతీయ నిర్వహణ సంస్థ (ఐఐఎం) లేకపోవడం లోటుగా ఉందని సీఎం పేర్కొన్నారు. ఐఐఎం ఏర్పాటుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి వెంటనే అనుమతి సాధించాలని ఎంపీలకు సూచించారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్ 2 విస్తరణ, ఫేజ్ 1 స్వాధీనం ప్రక్రియ, రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం నిర్మాణ ప్రారంభం, దక్షిణ భాగానికి కేంద్ర మంత్రి మండలి ఆమోదం, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద నిధుల మంజూరు వంటి అంశాలపై కేంద్రంతో నిరంతర సమన్వయం కొనసాగించాలని కోరారు. ముఖ్యంగా బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి కేంద్రంతో చర్చించి ఈ ప్రాజెక్టులకు వేగం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అంతర్రాష్ట్ర జల వివాదాలు, గోదావరికావేరి అనుసంధానం, తుంగభద్ర నుంచి తెలంగాణకు రావాల్సిన నీటి వాటా, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు, ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభమైన ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ నుంచి నిరభ్యంతర పత్రాల సాధన వంటి అంశాలు రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత కీలకమని సీఎం వివరించారు. ఈ అంశాల్లో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖతో పాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో ఎంపీలు చర్చలు జరిపి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అదేవిధంగా శంషాబాద్ నుంచి బెంగళూరు, చెన్నై, ముంబయికి ప్రతిపాదిత బుల్లెట్ రైలు ప్రాజెక్టులు, ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాల అభివృద్ధి, ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్) కేంద్రాలు, ఎయిర్ కార్గో హబ్‌ల ఏర్పాటుకు కేంద్ర అనుమతులు తీసుకురావాలని సూచించారు.

రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సానుకూల సహకారాన్ని కొనసాగిస్తున్నామని పేర్కొన్న సీఎం, ఎంపీలకు అవసరమైన సాంకేతిక సమాచారం, పత్రాలు, గణాంకాలు అందించేందుకు ఢిల్లీ తెలంగాణ భవన్‌లో ప్రత్యేక సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని పార్టీల ఎంపీలను సమన్వయం చేస్తూ రాష్ట్ర హక్కులు, అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఒకే వేదికపై పనిచేయాలని ఎంపీల కన్వీనర్ డాక్టర్ మల్లు రవికి సూచించారు.

ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, ఎంపీలు మల్లు రవి, అనిల్ కుమార్ యాదవ్, ఈటల రాజేందర్, కుందూరు రఘువీర్ రెడ్డి, కడియం కావ్య, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రఘురాం రెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




## నీట్ అభ్యర్థులకు అలర్ట్..

**తెలంగాణ బ్యూరో, ఆశ్వి అప్డేట్స్:**

నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్ యూజీ)2026 ఓఎంఆర్ జవాబు పత్రాల స్కాన్డ్ ఇమేజ్‌లను, రికార్డెడ్ రెస్పాన్స్‌లను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. విద్యార్థుల సౌకర్యార్థం వారు రిజిస్ట్రేషన్ సమయంలో అందించిన ఈమెయిల్ ఐడీలకు కూడా ఓఎంఆర్ షీట్ స్కాన్డ్ కాపీలను పంపినట్లు ఎన్టీఏ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. అభ్యర్థులు తమ రికార్డెడ్ రెస్పాన్స్‌లలో ఏవైనా వ్యత్యాసాలు ఉంటే వాటిని ఆన్‌లైన్ ద్వారా ఛాలెంజ్ చేయడానికి అవకాశం కల్పించారు. సోమవారం (జూలై 13) నుంచి ప్రారంభమైన ఈ ఛాలెంజ్ ప్రక్రియ జూలై 15వ తేదీ ఉదయం 11:00 గంటల వరకు కొనసాగుతుంది. విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ https://neet.nta.nic.in/ ద్వారా లాగిన్ అయి వివరాలను తనిఖీ చేసుకోవచ్చు. డేటా భద్రత, గోప్యతను కాపాడటం కోసం ఈసారి టూఫ్యాక్టర్ అథెంటికేషన్ (2ఎఫ్ఏ) విధానాన్ని ప్రవేశపెట్టారు. అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్ ఎంటర్ చేసిన తర్వాత, రిజిస్టర్డ్ మొబైల్ నంబర్, ఈమెయిల్‌కు వచ్చే వన్‌టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ)ని నమోదు చేస్తేనే ఓఎంఆర్ షీట్ కనిపిస్తుంది. కాగా, కీ ఛాలెంజ్ ప్రక్రియ ఇప్పటికే ముగిసిందని, జవాబులపై ఎలాంటి అభ్యంతరాలను స్వీకరించబోమని ఎన్టీఏ స్పష్టం చేసింది

**రూ.200 ప్రాసెసింగ్ ఫీజు..**

**క్లెయిమ్ నిజమైతే రీఫండ్**

అభ్యర్థులు సమర్పించిన భౌతిక ఓఎంఆర్ షీట్‌లో మార్క్ చేసిన జవాబులకు, స్కానింగ్ ఏజెన్సీ రికార్డ్ చేసిన రెస్పాన్స్‌లకు మధ్య వ్యత్యాసాలు ఉంటే.. ప్రతి ప్రశ్నకు రూ.200 వంతున ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి ఆన్‌లైన్ పోర్టల్‌లో అభ్యంతరం వ్యక్తం చేయవచ్చు. స్కానింగ్ యంత్రం పొరపాటుగా రీడ్ చేసిందని తేలి, అభ్యర్థి క్లెయిమ్ నిజమని నిర్ధారణ అయితే ఈ ప్రాసెసింగ్ ఫీజును తిరిగి రీఫండ్ చేస్తారు. నెట్ బ్యాంకింగ్, డెబిట్ /క్రెడిట్ కార్డు లేదా యూపీఐ ద్వారా జూలై 15 ఉదయం 11:00 గంటల లోపు ఈ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఫీజు రశీదు లేని మరియు ఇతర మార్గాల్లో వచ్చే అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోరు.

# షాబాద్ ఉన్మాది రాజ్‌కుమార్ ఆత్మహత్య!

**షాబాద్/హైదరాబాద్, జూలై 13 , ఆశ్వి అప్డేట్స్:**

రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ముగ్గురు ¾పిల్లలు సహా ఆరుగురిని కిరాతకంగా గొంతు కోసి హత్య చేసిన నరరూప రాక్షసుడు రాజ్‌కుమార్ కథ విషాదాంతమైంది. పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న ఈ ఉన్మాది చివరకు తన మేనమామ ఊరైన కొత్తూరు మండలం పంజర్లలో విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. మృతదేహం పక్కన పాయిజన్ బాటిల్ లభ్యమైనట్లు తెలుస్తోంది. తనపై పోక్సో కేసు పెట్టారనే కక్షతో రగిలిపోయిన రాజ్‌కుమార్ ఈనెల 10న అర్ధరాత్రి మూడు వేర్వేరు ప్రాంతాల్లో అత్యంత దారుణంగా ఆరుగురిని అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. మొదట షాబాద్ టౌన్‌లో మైనర్ బాలిక తల్లి, నాయనమ్మలను నరికి చంపాడు. ఆపై ఆ బాలికను అఖిల్ సాగర్ చెరువు వద్దకు తీసుకెళ్లి గొంతుకోశాడు. అంతటితో ఆగకుండా తన ఇంటికి వెళ్లి భార్య, ఇద్దరు కొడుకులను సైతం కిరాతకంగా బలిగొన్నాడు. ఈ ఘోర ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

**12 బృందాల గాలింపు.. రివార్డు ప్రకటన**

ఈ దారుణ ఉదంతాన్ని సవాల్‌గా తీసుకున్న పోలీసులు నిందితుడిని పట్టుకునేందుకు తెలంగాణ, కర్ణాటక సరిహద్దుల్లో 12 ప్రత్యేక బృందాలతో ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడిపై లుకౌట్ నోటీసులు జారీ చేయడమే కాక రూ.2 లక్షల రివార్డును కూడా ప్రకటించారు.

**ఆత్మహత్య డ్రామా.. చివరకు శవమై తేలి..**

ఆరుగురిని చంపిన తర్వాత 'నేను కూడా చనిపోతున్నా' అని రాజ్‌కుమార్ తన తండ్రికి ఫోన్ చేసినట్లు సమాచారం. మొదట తిమ్మాపూర్ రైల్వే ట్రాక్ వద్ద ఆత్మహత్య డ్రామా ఆడి పోలీసులను తప్పుదోవ పట్టించి తప్పించుకున్నాడు. కానీ చివరకు పంజర్లలో శవమై తేలాడు. దీంతో కేసు కీలక మలుపు తిరిగింది.

**బాలికను నమ్ముకుని అప్పులపాలయ్యా..సెల్ఫీ వీడియోలో రాజకుమార్**

రంగారెడ్డి : షాబాద్‌లో ఆరు హత్యలకు ముందు రోజు హంతకుడు రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో తీసుకున్నాడని ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి తెలిపారు. అతని మృతదేహం వద్ద లభించిన సెల్‌ఫోన్‌లో సెల్ఫీ వీడియోను గుర్తించినట్లు పేర్కొన్నారు. వీడియో రికార్డు వివరాల ఆధారంగా హత్యాకాండకు ముందురోజు అంటే జులై 10న వీడియో రికార్డు చేసినట్లు గుర్తించామని చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన విషయాలను సీపీ తరుణ్ జోషి మీడియాకు వెల్లడించారు. తాను అప్పులపాలయ్యానని, జీవితం మీద విరక్తి చెందినట్లు నిందితుడు ఈ వీడియోలో ఉందని అన్నారు. తన సంపాదనలో సగం వాళ్లకే పెట్టానని, తన దగ్గర డబ్బు వసూలు చేసి నష్టపరిచారని తెలిపాడన్నారు. తన పిల్లలకు భూమి లేకుండా చేసుకున్నానని. ఆ అమ్మాయిని నమ్మి అప్పుల పాలయ్యానని, చివరకు కేసు పెట్టి జైలుకు పంపాలని చూస్తున్నారని రాజ్‌కుమార్ వీడియో రికార్డ్ చేశాడని సీపీ వెల్లడించారు. 11 నుంచి 12 గంటల మధ్యలో ఆరు హత్యలు జరిగాయని సీపీ తరుణ్ జోషి చెప్పారు. రాజ్‌కుమార్ రూ.2 వేలకు కారు అద్దెకు తీసుకున్నాడని, ఘటన జరిగిన రోజు పదిన్నర గంటలకు ఊర్లోకి వచ్చాడని, అమ్మాయిని తీసుకుని దేవరకొండకు వెళ్లాడని చెప్పారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు అలవాటు ఉండటంతో నిందితుడు 16 సిమ్ కార్డులు వాడాడని చెప్పారు. నిందితుడికి రూ.2 కోట్లకుపైగా అప్పు ఉందని, దానివల్ల మానసిక పరిస్థితి స్థిమితంగా లేదని చెప్పారు. కాలేజీ నుంచి వచ్చేటప్పుడు వెళ్లేటప్పుడు ఆ బాలికను వేధించాడన్నారు. అతనిపై పోక్సో కేసు ఉందని, తాజాగా ముందస్తు బెయిల్ వచ్చిందని వెల్లడించారు. షాబాద్‌లో బాలిక నానమ్మను చంపి అక్కడ నుంచి ఆమెను తీసుకుని దైవాలగూడ వెళ్లాడని సీపీ తరుణ్ జోషి తెలిపారు. అక్కడ బాలిక, తన భార్యను, పిల్లలను నిందితుడు చంపేశాడని వెల్లడించారు. 11:37 గంటలకు తన తండ్రికి ఫోన్ చేసి ఆరుగురిని చంపేశానని, తాను ఆత్మహత్య చేసుకుంటానని రాజ్‌కుమార్ చెప్పాడని తెలిపారు. ఒంటిగంటకు హంతకుడి తండ్రి పోలీసులకు సమాచారం ఇచ్చారని చెప్పారు. ఈ ఘటన తర్వాత బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆ తర్వాత నిందితుడిని పట్టుకునేందుకు పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయని, జీపీఎస్ ఆధారంగా రాజ్‌కుమార్‌ని పట్టుకునేందుకు యత్నించామని వివరించారు. క్లూస్ టీం సభ్యులు మృతదేహం లభించిన ప్రాంతాన్ని పరిశీలించారన్నారు. ఎన్నిగంటలకు రాజ్‌కుమార్ చనిపోయాడనేది క్లారిటీ లేదని తెలిపారు. పెంజర్లలో రాజ్‌కుమార్ మేనమామ ఉన్నారని తెలిపారు. నిందితుడికి సంబంధించిన నాలుగు కుటుంబాలు ఈ గ్రామంలోనే ఉంటున్నాయని సీపీ తరుణ్ జోషి పేర్కొన్నారు





# యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- **జాప్యంపై డీజీపీ సీవీ ఆనంద్ ఆగ్రహం.. నిర్లక్ష్యం సహించేది లేదని హెచ్చరిక**

**ఆశ్వి అప్డేట్స్ హైదరాబాద్, జూలై 13:**

రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైపీఎస్) అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని తెలంగాణ డీజీపీ, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ సొసైటీ అధ్యక్షుడు సీ.వి. ఆనంద్ ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన సొసైటీ కమిటీ సమావేశంలో పాఠశాల విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పరిపాలన, భవిష్యత్ కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు.

నిర్మాణ పనుల్లో జరుగుతున్న జాప్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన డీజీపీ, ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టులో నిర్లక్ష్యం, ఆలస్యం ఏ మాత్రం సహించబోమని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, నిర్మాణ సంస్థ ప్రతినిధులకు ఆదేశించారు.

దేశంలోనే ఆదర్శ విద్యాసంస్థగా యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్న డీజీపీ, విలువలతో కూడిన, సాంకేతిక ఆధారిత, అంతర్జాతీయ ప్రమాణాల విద్యను అందించడంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత కలిగిన విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు.

ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 345 నుంచి 360కు పెరిగిందని, ప్రస్తుతం నర్సరీ నుంచి 6వ తరగతి వరకు బోధన కొనసాగుతోందని సమావేశంలో వెల్లడించారు. మొత్తం 360 మంది విద్యార్థుల్లో 184 మంది పోలీసు కుటుంబాలకు చెందిన వారు కాగా, 176 మంది సాధారణ కుటుంబాలకు చెందిన వారని అధికారులు వివరించారు.

పాఠశాల విస్తరణలో భాగంగా 17 తరగతి గదులతో కొత్త అకడమిక్ బ్లాక్ నిర్మాణ ప్రణాళికను కూడా సమావేశంలో ఆమోదించారు. విద్యతో పాటు క్రీడలు, వ్యక్తిత్వ వికాసం, జీవన నైపుణ్యాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని డీజీపీ సూచించారు. విద్యార్థులకు ఆధునిక మౌలిక సదుపాయాలు, సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించాలని, తల్లిదండ్రుల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా విద్యా నాణ్యత, భద్రత, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. సంస్థ పరిపాలనను మరింత బలోపేతం చేసేందుకు ప్రొక్యూర్‌మెంట్, అకడమిక్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కోఆర్డినేషన్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు సమావేశంలో ప్రకటించారు. ఈ సమావేశంలో పలువురు ఉన్నత పోలీసు అధికారులు, పాఠశాల ప్రిన్సిపాల్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



# ప్రజలకు సత్వర న్యాయం అందించాలి: వికారాబాద్ ఎస్పీ స్నేహ మెహ్రా

**వికారాబాద్, జూలై 13, ఆశ్వి అప్డేట్స్:**

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును వెంటనే స్వీకరించి, చట్టబద్ధంగా విచారణ పూర్తి చేసి బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం పరిగి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ, రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసులు, సీసీటీఎన్ఎస్ నమోదు, స్టేషన్ పరిశుభ్రత, సిబ్బంది పనితీరును సమీక్షించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి, పేకాట, అక్రమ మద్యం, సైబర్ నేరాలపై నిరంతర నిఘా కొనసాగించాలని, రాత్రి వేళల్లో బీట్ పెట్రోలింగ్, వాహన తనిఖీలు, విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. గ్రామ పోలీస్ అధికారులు, వికారాబాద్ సురక్ష మిత్ర వాలంటీర్లతో సమన్వయం పెంచాలని సూచించారు. అనంతరం వికారాబాద్ రక్షణ నేత్రం కింద ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించిన ఎస్పీ, CCTNS, eSakshya వంటి సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించి పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ కొండల్ రెడ్డి, ఎస్ఐతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





# సైబర్ నేరాల నియంత్రణకు సాంకేతికతే కీలకం: ఖమ్మం సీపీ సునీల్ దత్

**ఖమ్మం, జూలై 13, ఆశ్వి అప్డేట్స్:**

సైబర్ నేరాలను అరికట్టడానికి, డిజిటల్ భద్రతను మరింత పటిష్ఠం చేయడానికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ఎంతో అవసరమని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. పోలీస్ శిక్షణ కేంద్రంలో పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు సైబర్ నేరాల నియంత్రణ, దర్యాప్తు, డిజిటల్ ఫోరెన్సిక్స్, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్, మనీ రిస్టోరేషన్ పోర్టల్, గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మెకానిజం, సమన్వయ పోర్టల్ తదితర అంశాలపై సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు సాంకేతికతను ఉపయోగించి మోసాలకు పాల్పడుతున్నారని, అదే సాంకేతికతతో వారిని ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో సైబర్ నేరాల దర్యాప్తు, స్పందన, అమలు వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, ప్రజల్లో ముఖ్యంగా విద్యావంతుల్లో సైబర్ మోసాలపై అవగాహన పెంచాలని సూచించారు ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, సైబర్ క్రైమ్ ఏసీపీ ఫణీందర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పోలీస్ గేమ్స్‌లో మెరిసిన
# సిద్ధిపేట కమిషనరేట్ సిబ్బంది

**సిద్ధిపేట, జూలై 13, ఆశ్వి అప్డేట్స్:**

మల్కాజ్‌గిరిలో జూలై 7 నుంచి 9 వరకు నిర్వహించిన 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో పతకాలు సాధించిన సిద్ధిపేట పోలీస్ కమిషనరేట్ అధికారులను, సిబ్బందిని పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, ఐపీఎస్ అభినందించారు. పవర్‌లిఫ్టింగ్‌లో ఆర్ఎస్ఐ పి. రోహిత్, కరాటేలో ఎస్ఐపీ ఎ. అంజయ్య బంగారు పతకాలు సాధించగా, కరాటేలో పీసీ ఎన్. అనిల్ కుమార్, టైక్వాండోలో ఏఆర్‌పీసీ ఎ. భరత్, యోగాలో ఏఆర్‌డబ్ల్యూపీసీ డి. శ్రావణి కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. 'ప్రాజెక్టు సిద్ధి' ద్వారా శిక్షణ పొందిన శ్రావణి తొలి ప్రయత్నంలోనే పతకం సాధించడం విశేషమని కమిషనర్ పేర్కొన్నారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించడం అభినందనీయమని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని రష్మి పెరుమాళ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (ఏఆర్) సుభాష్ చంద్రబోస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.



## ధరూర్‌లో నూతన రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన.. మంత్రి కోమటిరెడ్డికి జిల్లా ఎస్పీ ఘన స్వాగతం

**గద్వాల, జూలై 13, ఆశ్వి అప్డేట్స్:**

జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల కేంద్రంలో నూతన రోడ్ల నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్ పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. ప్రాంతీయ రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ పనులు ఉపయోగపడనున్నాయని అధికారులు తెలిపారు.





# నేరాల నియంత్రణకు శాస్త్రీయ దర్యాప్తు చేపట్టాలి: సీపీ గౌష్ ఆలం

**కరీంనగర్, జూలై 13, ఆశ్వి అప్డేట్స్:**

నేరాల నియంత్రణలో శాస్త్రీయ దర్యాప్తు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 2026 తొలి అర్ధవార్షిక నేరాల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసి, నిర్దేశిత గడువులో చార్జిషీట్లు దాఖలు చేయాలని సూచించారు. మహిళలు, చిన్నారులపై నేరాలు, సైబర్ నేరాలు, డ్రగ్స్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. CCTNS2.0, eSakshya, CEIR వంటి సాంకేతిక వ్యవస్థలను పూర్తిస్థాయిలో వినియోగించి నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని తెలిపారు. అక్రమ మద్యం, గంజాయి, పేకాట, ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు రాత్రి గస్తీ, ట్రాఫిక్ నిర్వహణ, డయల్ 100 ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సూచించారు.

విధుల్లో అలసత్వాన్ని సహించబోమని, ప్రజలకు నాణ్యమైన, పారదర్శక పోలీసు సేవలు అందించాలని సీపీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించడమే లక్ష్యం

- **శాంతిభద్రతల విషయంలో రాజీ లేదు.. నేర నియంత్రణకు ముందస్తు చర్యలే కీలకం: యాదాద్రి జోన్ డీఐజీ డి. జోయెల్ డేవిస్**

**నల్లగొండ, జూలై 13, ఆశ్వి అప్డేట్స్:**

ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించడమే ప్రతి పోలీసు అధికారి ప్రధాన లక్ష్యంగా ఉండాలని యాదాద్రి జోన్5 డీఐజీ డి. జోయెల్ డేవిస్, ఐపీఎస్ అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండబోదని, నేరాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే అవి జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే సమర్థవంతమైన పోలీసింగ్‌కు నిదర్శనమని స్పష్టం చేశారు. సోమవారం నల్లగొండ జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన సమగ్ర నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ జిల్లాలోని శాంతిభద్రతలు, నేరాల ధోరణి, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, ట్రాఫిక్ నిర్వహణ, సైబర్ నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

జిల్లా పోలీసు శాఖ పనితీరును అభినందించిన డీఐజీ, ఇదే అంకితభావం, క్రమశిక్షణతో ప్రజాసేవ కొనసాగించాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలకు దారితీసే పరిస్థితులను ముందుగానే గుర్తించి, సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో విలేజ్ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేసి, స్థానిక వివాదాలు, అనుమానాస్పద కదలికలపై ముందస్తు సమాచారం సేకరించి నేరాలను ప్రారంభ దశలోనే అరికట్టాలని సూచించారు.

రౌడీషీటర్లు, బైండోవర్ వ్యక్తులు, పాత నేరస్తులు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాదారులు, ఇతర అసాంఘిక శక్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని, నైట్ పెట్రోలింగ్, నాకాబందీలు, కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు, వాహన తనిఖీలు మరింత పటిష్టంగా నిర్వహించాలని ఆదేశించారు. అంతర్రాష్ట్ర సరిహద్దు జిల్లా కావడంతో గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు.

ప్రతి కేసులో శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలతో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించాలని, ఫోరెన్సిక్ సాక్ష్యాలు, డిజిటల్ ఎవిడెన్స్‌ను సమర్థవంతంగా వినియోగిస్తేనే కోర్టుల్లో నిందితులకు శిక్షలు పడతాయని డీఐజీ పేర్కొన్నారు. సైబర్ నేరాలపై గ్రామాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ట్రాఫిక్ నిబంధనల అమలులో రాజీ పడకుండా రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రతి ఎస్‌హెచ్ఓ తన పోలీస్ స్టేషన్‌ను సమర్థవంతంగా నడిపించే నాయకుడిగా వ్యవహరించాలని, పారదర్శకత, జవాబుదారీతనం, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని డీఐజీ పిలుపునిచ్చారు.

అనంతరం జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ డీఎస్పీలు, సీఐలు, ఎస్‌హెచ్ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి నేరాల నియంత్రణ, పెండింగ్ కేసులు, కమ్యూనిటీ పోలీసింగ్, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించి అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ రమేష్‌తో పాటు జిల్లా పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.








# ప్రజలకు అందుబాటులో ఉండాలి.. కేసులు పెండింగ్ ఉండొద్దు: ఎస్పీ నరసింహ

**సూర్యాపేట, జూలై 13, ఆశ్వి అప్డేట్స్:**

పోలీసు అధికారులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి, పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ, ఐపీఎస్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సూర్యాపేట డివిజన్ స్థాయి పోలీసు అధికారుల నెలవారీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

గత నెలలో నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతిని సమీక్షించిన ఎస్పీ, ఎలాంటి కేసులు పెండింగ్‌లో ఉండకుండా సకాలంలో దర్యాప్తు పూర్తి చేయాలని సూచించారు. నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంతో పాటు సమాచార వనరులను మరింత బలోపేతం చేయాలని, ప్రజల్లో నేరాల నివారణపై అవగాహన కల్పించాలని తెలిపారు. డీఎస్పీలు, సీఐలు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్ల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ సిబ్బందిని ప్రోత్సహించి మెరుగైన ఫలితాలు సాధించాలని ఎస్పీ సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.





## రెండేళ్లలో 60 వేలకుపైగా కేసుల పరిష్కారం: ఎన్‌సీఎస్‌సీ ఛైర్మన్ కిషోర్ మక్వానా

- **హైదరాబాద్‌లో ఆధునికీకరించిన రాష్ట్ర కార్యాలయం ప్రారంభం**

**హైదరాబాద్, జూలై 13, ఆశ్వి అప్డేట్స్:**

గత రెండేళ్లలో దేశవ్యాప్తంగా 60 వేలకుపైగా ఫిర్యాదులను పరిష్కరించి జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ (ఎన్‌సీఎస్‌సీ) చరిత్ర సృష్టించిందని కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వానా తెలిపారు. సోమవారం హైదరాబాద్ కవాడిగూడలోని సీజీవో టవర్స్‌లో ఆధునికీకరించిన ఎన్‌సీఎస్‌సీ రాష్ట్ర కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగంలోని 338వ అధికరణ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ, బాధితులకు న్యాయం అందించేందుకు కమిషన్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రతి ఫిర్యాదుదారుడికి సకాలంలో న్యాయం అందించడమే కమిషన్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్‌సీఎస్‌సీ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ మాట్లాడుతూ, చట్ట ఉల్లంఘనలపై నోటీసులు, సమన్లు జారీ చేయడంతో పాటు అవసరమైతే కఠిన చర్యలు తీసుకునే అధికారాలు కమిషన్‌కు ఉన్నాయని తెలిపారు. ఎస్సీ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం మరింత దృష్టి సారించాలని సూచించారు. ఎన్‌సీఎస్‌సీ రాష్ట్ర కార్యాలయ డైరెక్టర్ డాక్టర్ జి. సునీల్ కుమార్ బాబు మాట్లాడుతూ, 2024-2026 మధ్య హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం 10,853 ఫిర్యాదులను పరిష్కరించి రూ.33.80 కోట్ల నష్టపరిహారం బాధితులకు అందించిందన్నారు. అదనంగా 177 సుమోటో కేసులు నమోదు చేసి, 127 చట్టబద్ధ విచారణలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీఎస్‌సీ సభ్యులు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ షెడ్యూల్డ్ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గౌడ కులాన్ని దూషించానన్న ప్రచారం పూర్తిగా అవాస్తవం

- **తప్పుడు వీడియోలు, సోషల్ మీడియా పోస్టులతో దుష్ప్రచారం చేస్తున్నారు – కాంగ్రెస్ నాయకుడు రామ్‌మోహన్ గౌడ్**
- **వైరల్ చేస్తున్న వారిపై సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు.. పార్టీ అధిష్ఠానం చర్యలు తీసుకుంటుందన్న ఆశాభావం**

**ఎల్బీనగర్, జూలై 13, ఆశ్వి అప్డేట్స్:**



సోషల్ మీడియాలో తన పేరుతో గౌడ కులాన్ని అవమానించేలా ప్రచారం చేస్తున్న వీడియోలు, పోస్టులు పూర్తిగా అసత్యమని కాంగ్రెస్ పార్టీ నాయకుడు రామ్‌మోహన్ గౌడ్ స్పష్టం చేశారు. టీపీసీసీ కార్యదర్శి జక్కిడి ప్రభాకర్ రెడ్డి తనపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, ఎల్బీనగర్‌లో బీసీ సంఘాల నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను గౌడ కులాన్ని దూషిస్తూ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని, తనపై జరుగుతున్న ప్రచారం వాస్తవాలకు విరుద్ధమని రామ్‌మోహన్ గౌడ్ పేర్కొన్నారు. అన్ని కులాల వారితో సమాన ఆప్యాయత, సాన్నిహిత్యం కలిగి ఉన్న వ్యక్తినని, తన సొంత కులాన్ని తానే అవమానించే పరిస్థితి ఎప్పటికీ ఉండదని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం తన మాటలను వక్రీకరించి, అసత్య ప్రచారాన్ని సోషల్ మీడియా వేదికగా కొందరు ఉద్దేశపూర్వకంగా విస్తరిస్తున్నారని ఆరోపించారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకుల మధ్య విభేదాలు సృష్టించేందుకు కుట్రపూరితంగా తప్పుడు ప్రచారం జరుగుతోందని ఆయన అన్నారు. పార్టీ కార్యకర్తలు, బీసీ సంఘాల నాయకులు, ప్రజలు ఇటువంటి నిరాధార ప్రచారాన్ని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. పార్టీ బలోపేతమే తన లక్ష్యమని, వ్యక్తిగత విమర్శలు లేదా కులాలను కించపరిచే వ్యాఖ్యలు చేసే సంస్కృతి తనకు లేదని తెలిపారు. టీపీసీసీ కార్యదర్శి జక్కిడి ప్రభాకర్ రెడ్డి తనపై చేసిన వ్యాఖ్యలను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించిన రామ్‌మోహన్ గౌడ్, దీనిపై కాంగ్రెస్ పార్టీ తగిన చర్యలు తీసుకుంటుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు ఉంటాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. అలాగే తన పేరుతో తప్పుడు వీడియోలు రూపొందించి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న వ్యక్తులపై సైబర్ క్రైమ్ పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వాస్తవాలను వక్రీకరించి సామాజిక వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు చెప్పారు. సోషల్ మీడియా వేదికలను దుర్వినియోగం చేసి వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురు బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ, రాజకీయ విభేదాల కోసం కులాలను వివాదాల్లోకి లాగడం సమాజానికి మంచిది కాదన్నారు. నిర్ధారణ లేని సమాచారాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేయడం వల్ల ప్రజల్లో అపోహలు ఏర్పడతాయని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో బీసీ సంఘాల నాయకులు చామకూరి రాజు, కే.వి. గౌడ్, బొంగు వెంకటేష్ గౌడ్, రాజు, దుర్గయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి ప్రజావాణికి 103 ఫిర్యాదులు

- **ప్రజల వినతులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి: కలెక్టర్ సి. నారాయణరెడ్డి**

**రంగారెడ్డి, జూలై 13, ఆశ్వి అప్డేట్స్:**

రంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 103 ఫిర్యాదులు అందాయి. ప్రజలు వివిధ సమస్యలపై జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డికి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని అధికారులు బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలు సమర్పించిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలు క్షుణ్ణంగా పరిశీలించి, పెండింగ్‌లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ఈ ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు 23, ఇతర శాఖలకు 80 ఫిర్యాదులు అందగా, మొత్తం 103 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కె. కిరణ్మయి, కె. చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.



# ఐక్యరాజ్యసమితి ఛార్టర్ ఉల్లంఘనలు


- **ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచుతున్న అమెరికా**
- **తాజా దాడులపై మండిపడ్డ ఇరాన్**



**టెహ్రాన్, జూలై 13 (మనసులో మాట):** పశ్చిమాసియాలో యుద్ధం ఆగినట్టే కనిపించినా.. ఇటీవల మళ్లీ ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. ఇరాన్, అమెరికా పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే హర్మూజ్‌లో ప్రయాణిస్తోన్న నౌకలపై ఐఆర్‌జీసీ దాడులు చేయడం తాజా ఉద్రిక్తతలకు మరింత ఆజ్యంపోసింది. అమెరికా జరిపిన తాజా సైనిక దాడులపై ఇరాన్ తీవ్రస్థాయిలో మండిపడింది. ఈ దాడులను ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను స్పష్టంగా ఉల్లంఘించడమేనని అభివర్ణించిన ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ, వాషింగ్టన్ చర్యలు ప్రాంతీయ స్థిరత్వాన్ని, కాల్పుల విరమణ ఒప్పందాన్ని దెబ్బతీస్తున్నాయని ఆరోపించింది. ఇది ముమ్మాటికీ ప్రాంతీయ ఉద్రిక్తతలను మరింత పెంచడమేనని ఆరోపించింది. ఈ మేరకు ఒక అధికారిక ప్రకటన విడుదల చేస్తూ, అమెరికాకు సహకరించే దేశాలకు ఇరాన్ గట్టి హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా తమపై దాడులు చేయడానికి ఏ దేశమైనా తన భూభాగాన్ని లేదా సదు-పాయాలను ఉపయోగించుకోవడానికి అనుమతిస్తే, ఆ దేశాలను కూడా తాము శత్రువులుగానే పరిగణిస్తామని ఇరాన్ స్పష్టం చేసింది. 'ఇరాన్‌పై సైనిక దాడులు చేయడానికి ఏ దేశ భూభాగం లేదా సదుపాయాలు ఉపయోగించినా, దానిని దురాక్రమణకు మూలంగా పరిగణిస్తాం. ఇరాన్ సాయుధ దళాల రక్షణాత్మక చర్యల్లో భాగంగా వాటిని చట్టబద్ధమైన లక్ష్యాలుగా చూస్తాం'. అని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఇటీవల మస్కట్‌లో జరిగిన చర్చల ఫలితాలపై అమెరికా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలను ఇరాన్ పూర్తిగా తోసిపుచ్చింది. వాటిని 'పచ్చి అబద్ధం' గా తేల్చింది. మస్కట్ చర్చలు కేవలం హోర్ముజ్ జలసంధి నిర్వహణ, అంతర్జాతీయ షిప్పింగ్ మార్గాల భద్రతకు సంబంధించిన ఏర్పాట్లపైనే జరిగాయని, అమెరికా అధ్యక్షుడు చిత్రీకరిస్తున్నట్లుగా కాదని ఇరాన్ స్పష్టం చేసింది. అమెరికా జరిపిన సైనిక చర్యలపై ఐక్యరాజ్యసమితి సెక్రటేరియట్ స్పందించిన తీరు సరిగ్గా లేదని ఇరాన్ విమర్శించింది. అంతర్జాతీయ చట్టాలను, ఐరాస చార్టర్‌ను ఉల్లంఘించిన అమెరికాను జవాబుదారీగా చేయాలని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్, భద్రతా మండలిని ఇరాన్ కోరింది. హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే వాణిజ్య నౌకలు, పౌరులపై దాడులు చేసే ఇరాన్ సామర్థ్యాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా అమెరికా సెంట్రల్ కమాండ్ ఆదివారం ఇరాన్‌పై సరికొత్త సైనిక దాడులను ప్రారంభించింది. అంతకుముందు శనివారం కూడా అమెరికా దళాలు ల్యాండ్, సీ-బేస్డ్ ÷టైర్ ఎయిర్‌క్రాఫ్ట్, డ్రోన్లు, నౌకాదళ నౌకల ద్వారా దాదాపు 140 ఇరాన్ సైనిక లక్ష్యాలపై కచ్చితమైన దాడులు చేశాయి. ఇందులో ఇరాన్ క్షిపణి, డ్రోన్ సైట్లు, నౌకాదళ సామర్థ్యాలు, మందుగుండు సామగ్రి నిల్వ కేంద్రాలు, తీర నిఘా ప్రాంతాలు ఉన్నాయి. అమెరికా దాడుల అనంతరం దక్షిణ ఇరాన్ నగరాలైన జాస్క్, బందర్ అబ్బాస్, సిరిక్‌లలో మూడు భారీ పేలుళ్లు సంభవించినట్లు ఇరాన్ ప్రెస్ టీవీ ధృవీకరించింది. మరోవైపు, ఇరాన్-అమెరికా మధ్య పెరుగుతున్న సైనిక ఘర్షణలపై ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఉద్రిక్తతలు ప్రాంతీయంగానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా తీవ్ర పరిణామాలకు దారితీస్తాయని ఆయన హెచ్చరించారు.

# పౌరసత్వ నిర్ధారణలో పారదర్శకత ముఖ్యం

- **అసోంలో 27మంది వ్యక్తుల పౌరసత్వంపై విచారణ**
- **వారిపై బలవంతపు చర్యలు తీసుకోరాదన్న సుప్రీం**




**న్యూఢిల్లీ, జూలై 13(మనసులో మాట) :** పౌరసత్వాన్ని నిర్ధారించే లేదా ఒక వ్యక్తిని విదేశీయుడిగా ప్రకటించే ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, న్యాయబద్ధంగా ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అస్సాం లోని ఫారినర్స్ ట్రిబ్యునళ్లు 'విదేశీయులు'గా ప్రకటించిన 27 మంది వ్యక్తుల పౌరస త్వ స్థితిపై సోమవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం ఈ మేరకు కీలక తీర్పునిచ్చింది. 'పౌ రసత్వం, విదేశీయుడి హోదా అనేవి అత్యున్నత రాజ్యాం గ, చట్టపరమైన ప్రాముఖ్యత కలిగిన అంశాలు' అని ఈ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది. అక్రమంగా పౌరస త్వం పొందాలని చూసే వారిని నిరోధించడంలో ప్రభు త్వానికి స్పష్టమైన ప్రయోజనాలు, బాధ్యతలు ఉంటాయనే విషయాన్ని సుప్రీంకోర్టు అంగీకరించింది. 'చట్టబద్ధంగా అర్హత లేని వ్యక్తులు.. తప్పుడు పత్రాలు, తప్పుడు క్లెయి మ్‌ల ద్వారా భారతీయ పౌరసత్వాన్ని పొందకుండా చూ సేందుకు ప్రభుత్వానికి చట్టబద్ధమైన, బలమైన ఆసక్తి ఉంటుంది. అయితే, తుది విశ్లేషణలో ఆ ఆసక్తి లేదా ప్రయోజనం.. న్యాయబద్ధమైన పక్రియను అధిగమించలే వు'. అని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి గతంలో గౌహతి హైకోర్టు, ఫారినర్స్ ట్రిబ్యునళ్లు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. ట్రిబ్యునళ్లలో ఈ కేసుపై మరోసారి విచారణ జరిగే వరకు ఆ 27 మంది వ్యక్తులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకూడదని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. అయితే, పిటిషనర్ల పౌరసత్వాన్ని నిర్ధారించడానికి తాము ఇంకా ఎటువంటి ఆధారాలను పూర్తిగా పరిశీలించలేదని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. కోర్టును ఆశ్రయించిన వారిలో సావిత్రి దేయ్, అజ్బహర్ అలీ, ఎండీ అక్బర్ అలీ, అబేదా ఖాతూన్, అనోవారా ఖాతూన్ అనే వ్యక్తులు ఉన్నారు. పాత ఓటర్ల జాబితాలో పేర్ల స్పెల్లింగ్స్ తప్పుగా పడటం, చిన్న చిన్న తేడాలు ఉండటం వంటి సాంకేతిక కారణాల వల్లే తమను విదేశీ-యులుగా ప్రకటించారని వారు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తాము భారతీయ పౌరులమేనని నిరూపించుకోవడానికి 1971 కంటే ముందు నాటి లెగసీ డేటా, ఓటర్ల జాబితాలు, భూమి రికార్డులను వారు కోర్టుకు సమర్పించారు. కాగా, గత జూన్ నెలలో కూడా ఇలాంటి ఒక కేసులోనే.. ఐదుగురు మహిళలను విదేశాలుగా బహిష్కరించకుండా సుప్రీంకోర్టులోని మరో బెంచ్ అడ్డుకుంది. అవసరమైన అన్ని పత్రాలు సమర్పించినప్పటికీ, కేవలం పేర్ల స్పెల్లింగ్స్‌లో తేడాలు ఉన్నాయనే కారణంతో వారిని విదేశీయులుగా ప్రకటించారని అప్పట్లో కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజా తీర్పుతో అస్సాంలోని ఫారినర్స్ ట్రిబ్యునళ్లు పౌరసత్వ క్లెయిమ్‌లను పరిశీలిస్తున్న తీరు, వారి ప్రమాణాలపై దేశవ్యాప్తంగా చట్టపరమైన చర్చ మొదలైందని నిపుణులు భావిస్తున్నారు.

# గోవధ నిషేధంపై మద్రాస్ హైకోర్టు తీర్పుపై స్టే

**తీర్పుకు సవరణ అవసమన్న సుప్రీంకోర్టు**

**న్యూఢిల్లీ, జూలై 13(మనసులో మాట):** తమిళనాడులో గోవధను పూర్తిగా నిషేధిస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు సోమవారం స్టే విధించింది. హైకోర్టు ఇచ్చిన తీర్పుకు 'సవరణ' అవసరమని పేర్కొంటూ, ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం పెద్ద ఊరటనిచ్చింది. బక్రీద్ పండుగ సందర్భంగా లేదా మరే ఇతర రోజుల్లోనైనా రాష్ట్రంలో ఆవులు, దూడల వధ జరగకుండా చూడాలంటూ మే 27న మద్రాస్ హైకోర్టు తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ విజయ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం తన వాదనలను వినిపించింది. రాష్ట్రంలో అమలులో ఉన్న చట్టం ప్రకారం.. కొన్ని నిర్దిష్ట కేటగిరీల ఆవులను, అనుమతించిన ప్రాంతాలలో వధించడానికి చట్టబద్ధమైన అనుమతి ఉందని ప్రభుత్వం పేర్కొంది. 'చట్టంలోని నిబంధనలు ఓ నిర్దిష్ట పక్రియకు అనుమతిస్తున్నప్పుడు, దానికి విరుద్ధంగా కోర్టులు న్యాయపరమైన ఆదేశాలు జారీ చేయడం చట్టబద్ధంగా చెల్లదని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వాదించింది. మద్రాస్ హైకోర్టుకు చెందిన జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్, జస్టిస్ వి. లక్ష్మీనారాయణతో కూడిన ధర్మాసనం.. ఆగస్టు 1976 నాటి ఓ ప్రభుత్వ ఉత్తర్వును (ఉక్ష) ఆధారంగా చేసుకుని ఈ నిషేధాన్ని విధించింది. పాల ఉత్పత్తిని పెంచడానికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి 1976లో గోవధను నిషేధిస్తూ ఆ ఉత్తర్వు ఇచ్చారు. తీర్పును రాసిన జస్టిస్ స్వామినాథన్.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 48 ప్రకారం ఆవులు, దూడలు, ఇతర పాడి పశువుల వధను నిషేధించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రాజ్యాంగ పరిషత్ చర్చల్లో కూడా శ్రీకృష్ణుని కాలం నుంచి ఆవు మన నాగరికతతో ముడిపడి ఉన్న అత్యంత గౌరవనీయమైన జంతువుగా పేర్కొన్నారని ఆయన గుర్తుచేశారు. తమిళనాడులో సంప్రదాయకంగా బక్రీద్ పండుగ సమయంలో ముస్లింలు స్థానిక నిబంధనలకు లోబడి ప్రైవేట్ ప్రాంగణాల్లో లేదా మతపరమైన ప్రార్థనా స్థలాలలో జంతు బలులు ఇస్తారు. అలాగే, రాష్ట్రంలోని పలు హిందూ దేవాలయాలలో జరిగే వార్షిక ఉత్సవాల్లో కూడా జంతు బలులు ఇచ్చే సంప్రదాయం ఉంది. ఇటువంటి బలులను కేవలం లైసెన్స్ పొందిన కసాయిఖానాలకే పరిమితం చేయడం ఆచరణాత్మకంగా సాధ్యం కాదని, పండుగ రద్దీని తట్టుకునే సామర్థ్యం ఆయా కేంద్రాలకు లేదని కమ్యూనిటీ నాయకులు వాదిస్తున్నారు. తమిళనాడు ప్రభుత్వం తమ రాష్ట్రంలో 'తమిళనాడు జంతు సంరక్షణ చట్టం' ఇతర నియంత్రణ నిబంధనలు ఇప్పటికే అమలులో ఉన్నాయని స్పష్టం చేసింది. జంతువులను ఎక్కడ, ఏ పరిస్థితులలో వధించాలనే దానిపై స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని, అయితే పూర్తి నిషేధం చట్టంలో లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతానికి సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంతో తమిళనాడులో ఈ వివాదానికి తాత్కాలిక బ్రేక్ పడింది.

# పేపర్ లీక్‌లపై రాహుల్ గాంధీ మండిపాటు

**విద్యా వ్యవస్థ దోపిడీ యంత్రాంగంగా మారిందని విమర్శ**

**'ఛాత్రోన్ కీ గూంజ్'లో విద్యార్థులు పాల్గొనాలని పిలుపు**

**న్యూఢిల్లీ, జూలై 14(మనసులో మాట):** దేశంలో వరుసగా జరుగుతున్న ప్రశ్నపత్రాల లీకులు, విద్యా వ్యవస్థలో పెరుగుతున్న అవినీతిపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. భారత విద్యా వ్యవస్థ ప్రస్తుతం నిజాయతీ లేని దోపిడీ యంత్రాంగంగా మారిందని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. భారత విద్యా వ్యవస్థ గురించి తాను చేస్తున్న వ్యాఖ్యలు తన వ్యక్తిగత అభిప్రాయాలు కావని, దేశవ్యాప్తంగా విద్యార్థులు వ్యక్తం చేస్తున్న ఆవేదననే తాను ప్రతిబింబిస్తున్నానని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. విద్యార్థులను భవిష్యత్తుకు సిద్ధం చేయాల్సిన వ్యవస్థ వారిని, వారి కుటుంబాలను అప్పులు, మానసిక ఒత్తిడి, నిరాశల వైపు నెడుతోందని విమర్శించారు. దేశంలో కొనసాగుతున్న అవినీతే ప్రశ్నపత్రాల లీక్ మాఫియాకు ప్రధాన కారణమని రాహుల్ ఆరోపించారు. పోటీ పరీక్షల కోసం సంవత్సరాల పాటు కష్టపడుతున్న లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ఈ మాఫియా ఒక్కసారిగా నాశనం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ఈ అంశంపై మౌనం వహిస్తున్నారని విమర్శించారు. జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికే కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. అలాగే ఈ అంశాన్ని ప్రశ్నించాల్సిన మీడియా కూడా దీర్ఘకాలంగా మౌనంగా ఉందని వ్యాఖ్యానించారు.

**'ఛాత్రోన్ కీ గూంజ్'లో పాల్గొనాలని పిలుపు**

దేశ విద్యా రంగంలో సమూల మార్పులు అవసరమని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమంలో విద్యార్థులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. జూలై 17న డెహ్రాడూన్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి హాజరై విద్యార్థుల సమస్యలను మరింత బలంగా వినిపిద్దామని కోరారు. కార్యక్రమానికి సంబంధించిన నమోదు వివరాల లింక్‌ను కూడా తన 'ఎక్స్' పోస్టులో పంచుకున్నారు.



# తగ్గిన బంగారం

**హైదరాబాద్, జూలై 13(మనసులో మాట) :** బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి శుభవార్త. సోమవారం దేశవ్యాప్తంగా బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. గత ట్రేడింగ్ సెషన్‌తో పోలిస్తే పసిడి ధరలు గణనీయంగా తగ్గడంతో కొనుగోలుదారులకు ఊరట లభించింది. తాజా ధరల ప్రకారం హైదరాబాద్, విజయవాడ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,42,910గా నమోదైంది. గత ధరతో పోలిస్తే రూ.1,420 తగ్గింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,30,000కు చేరుకుంది. ఈ విభాగంలో కూడా రూ.1,300 మేర తగ్గుదల నమోదైంది. 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర హైదరాబాద్, విజయవాడతో పాటు విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి, నెల్లూరు, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ నగరాల్లో రూ.1,07,180గా కొనసాగుతోంది. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరల్లో స్వల్ప వ్యత్యాసం కనిపించింది. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,000గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం రూ.1,32,000గా నమోదైంది. న్యూఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం రూ.1,43,060, 22 క్యారెట్ల బంగారం రూ.1,31,150గా ఉంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు, కేరళ ప్రాంతాల్లో హైదరాబాద్‌తో సమానంగా ధరలు నమోదయ్యాయి. అహ్మదాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం రూ.1,42,960, 22 క్యారెట్ల బంగారం రూ.1,30,050గా ఉంది.అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, డాలర్ మారకం విలువ, కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు, భౌగోళిక పరిణామాల ప్రభావంతో బంగారం ధరల్లో రోజువారీ మార్పులు చోటు చేసుకుంటాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. కొనుగోలు చేసేముందు స్థానిక నగల దుకాణాల్లో తాజా ధరలను ఒకసారి పరిశీలించడం మంచిదని సూచిస్తున్నారు.




# ఈ వారం 4 రోజులు బ్యాంకులకు సెలవులు

**ముంబై, జూలై 13(మనసులో మాట) :** బ్యాంకు శాఖల్లో చేయాల్సిన పనులు ఉన్న ఖాతాదారులు ఈ వారం సెలవుల వివరాలను ముందుగానే తెలుసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. జూలై 13 నుంచి 19 వరకు వివిధ జాతీయ, ప్రాంతీయ, మతపరమైన పండుగలు, వారాంతపు సెలవుల కారణంగా నాలుగు రోజుల పాటు పలు ప్రాంతాల్లో బ్యాంకులు మూతపడనున్నాయి. భారతీయ రిజర్వు బ్యాంకు ప్రకటించిన వార్షిక సెలవుల జాబితా ప్రకారం జూలై నెలలో మొత్తం 12 రోజుల పాటు వివిధ రాష్ట్రాల్లో బ్యాంకులకు సెలవులు ఉన్నాయి. జూలై 16న రథయాత్ర, కాంగ్ పండుగ, హరేలా ఉత్సవాల సందర్భంగా భువనేశ్వర్, డెహ్రాడూన్, ఇంఫాల్ నగరాల్లో బ్యాంకులు పనిచేయవు. జూలై 17న యు. తిరోత్ సింగ్ వర్ధంతి సందర్భంగా షిల్లాంగ్‌లో బ్యాంకులకు సెలవు ఉంటుంది. జూలై 18న ద్రుక్పా త్షే-జి పండుగ సందర్భంగా గ్యాంగ్‌టక్‌లో బ్యాంకులు మూసివేస్తారు. జూలై 19న ఆదివారం కావడంతో దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకులు సెలవు పాటించనున్నాయి. భారతీయ రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం ప్రతి నెల రెండో, నాలుగో శనివారాలతో పాటు ప్రతి ఆదివారం అన్ని షెడ్యూల్డ్, నాన్-షెడ్యూల్డ్ బ్యాంకులు తప్పనిసరిగా మూసివేయబడతాయి. ఈ రోజుల్లో శాఖల ద్వారా ప్రత్యక్ష సేవలు అందుబాటులో ఉండవు. జూలై నెలలో 5, 12, 19, 26 తేదీలలో ఆదివారం సెలవులు ఉండగా, 11న రెండో శనివారం, 25న నాలుగో శనివారం కారణంగా కూడా బ్యాంకులు మూసి ఉంటాయి. అయితే బ్యాంకు సెలవు రోజుల్లో కూడా ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు యథావిధిగా కొనసాగుతాయి. ఖాతాదారులు మొబైల్ బ్యాంకింగ్, అంతర్జాల బ్యాంకింగ్, యూపీఐ, నగదు బదిలీ వంటి సేవలను ఎలాంటి అంతరాయం లేకుండా వినియోగించుకోవచ్చు. చెక్కుల జమ, రుణ దరఖాస్తులు, నగదు లావాదేవీలు వంటి శాఖల ద్వారా జరిగే సేవలు మాత్రమే అందుబాటులో ఉండవు. అందువల్ల అత్యవసర బ్యాంకింగ్ పనులు ఉన్నవారు ముందుగానే ప్రణాళిక చేసుకుని పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



## పశ్చిమాసియా ఉద్రిక్తత..

# పెరిగిన ముడి చమురు ధరలు


**న్యూఢిల్లీ, జూలై 13 (మనసులో మాట) :** పశ్చిమాసియాలో నెలకొన్న భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్రమవుతుండటంతో ప్రపంచ ఇంధన మార్కెట్లు ఆందోళనకు గురవుతున్నాయి. ముఖ్యంగా హర్మ్యాజ్ జలసంధి ద్వారా చమురు రవాణాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందన్న భయాలు మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి. సోమవారం ట్రేడింగ్ ప్రారంభంలోనే బ్రెంట్ ముడి చమురు ఫ్యూచర్స్ ధర 3.24 శాతం పెరిగి బ్యారెల్‌కు 78.47 అమెరికా డాలర్లకు చేరుకుంది. అలాగే అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ముడి చమురు ధర కూడా 3.30 శాతం పెరిగి బ్యారెల్‌కు 73.77 అమెరికా డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ప్రపంచవ్యాప్తంగా సముద్ర మార్గంలో జరిగే ముడి చమురు రవాణాలో దాదాపు ఐదో వంతు హర్మ్యాజ్ జలసంధి ద్వారానే సాగుతుంది. ముడి చమురుతో పాటు ద్రవీకృత సహజ వాయువు ఎగుమతులకు కూడా ఈ జలమార్గం అత్యంత కీలకంగా భావిస్తారు. ఈ మార్గంలో రవాణాకు ఆటంకం ఏర్పడే అవకాశం ఉందన్న ఆందోళనతో అంతర్జాతీయ చమురు మార్కెట్లు అప్రమత్తమయ్యాయి. ఇటీవలి పరిణామాల నేపథ్యంలో హర్మ్యాజ్ జలసంధిలో నౌకల రాకపోకలు కూడా తగ్గినట్లు అంతర్జాతీయ నివేదికలు సూచిస్తున్నాయి. గత కొన్ని వారాలతో పోలిస్తే ఆదివారం అత్యల్ప సంఖ్యలో మాత్రమే వాణిజ్య నౌకలు ఈ మార్గంలో ప్రయాణించినట్లు సమాచారం. దీంతో ప్రపంచ ఇంధన సరఫరాపై ఆందోళనలు మరింత పెరిగాయి. ఇదిలా ఉండగా, అమెరికా-ఇరాన్ మధ్య గత నెలలో ప్రారంభమైన శాంతి చర్చలు కూడా తాజా పరిణామాలతో ప్రతికూల ప్రభావాన్ని ఎదుర్కొంటున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. హర్మ్యాజ్ జలసంధిలో రవాణాను సాధారణ స్థితికి తీసుకురావడం, ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించడం లక్ష్యంగా సాగిన ప్రయత్నాలకు తాజా పరిణామాలు గండికొట్టే అవకాశముందని చెబుతున్నారు. అంతర్జాతీయ ఇంధన సంస్థ తాజా అంచనాల ప్రకారం ప్రపంచ చమురు సరఫరా కొంత పెరిగినప్పటికీ, సాధారణ అవసరాలతో పోలిస్తే ఇంకా గణనీయమైన కొరత కొనసాగుతోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగితే ముడి చమురు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని, దాని ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో పాటు ఇంధన ధరలపైనా పడే అవకాశముందని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.



# వృద్ధుడి ఖాతాలో రూ.759 కోట్లు

## బ్యాంకు అధికారుల విస్తుపాటు

**ముజఫర్‌పూర్, జూలై 13(మనసులో మాట) :** వృద్ధాప్య పింఛన్ డబ్బులు తీసుకోవడానికి వెళ్లిన ఓ వృద్ధుడి బ్యాంకు ఖాతాలో ఏకంగా రూ.759 కోట్లు కనిపించడం కలకలం రేపింది. ఇదే సమయంలో ఆయన కుమారుడి ఖాతాలో కూడా అంతే మొత్తం కనిపించడంతో బ్యాంకు అధికారులు, స్థానిక పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ ఘటన బీహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లాలో చోటుచేసుకుంది. 82 ఏళ్ల కామేశ్వర్ మిశ్రా తన వృద్ధాప్య పింఛన్ నగదు తీసుకునేందుకు సమీపంలోని సామాన్య సేవా కేంద్రానికి వెళ్లారు. ఆ రోజు బ్యాంకులకు సెలవు ఉండటంతో అక్కడే ఆధార్ ధ్రువీకరణ ద్వారా పింఛన్ మొత్తాన్ని ఉపసంహరించుకున్నారు. అనంతరం తన ఖాతాలో ఇంకా ఎంత మొత్తం ఉందో తెలుసుకోవాలని కేంద్రంలోని సిబ్బందిని కోరారు. సిబ్బంది ఖాతా వివరాలు పరిశీలించగా కామేశ్వర్ మిశ్రా ఖాతాలో ఏకంగా రూ.759 కోట్లు ఉన్నట్లు కనిపించింది. దీంతో వారు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. అనంతరం ఆయన దివ్యాంగుడైన కుమారుడి బ్యాంకు ఖాతాను కూడా పరిశీలించగా అందులోనూ రూ.759 కోట్లు జమ అయినట్లు గుర్తించారు. దీంతో ఇద్దరి ఖాతాల్లో కలిపి మొత్తం రూ.1,518 కోట్లు ఉన్నట్లు తేలింది. ఈ విషయాన్ని సామాన్య సేవా కేంద్రం సిబ్బంది వెంటనే సంబంధిత బ్యాంకు అధికారులకు, పోలీసులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న అధికారులు ప్రాథమిక విచారణ ప్రారంభించి, భద్రతా చర్యల్లో భాగంగా కామేశ్వర్ మిశ్రా, ఆయన కుమారుడి బ్యాంకు ఖాతాలను తాత్కాలికంగా స్తంభింపజేశారు. ఈ భారీ మొత్తం పొరపాటున జమ అయిందా, సాంకేతిక లోపం కారణమా లేదా మరేదైనా కారణమా అనే కోణాల్లో అధికారులు విచారణ చేపట్టారు. పూర్తి విచారణ అనంతరం అసలు విషయం వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.




# పీఎఫ్ ఖాతాదారులకు శుభవార్త

## నిధుల బదిలీ ఇక మరింత సులువు




**న్యూఢిల్లీ, జూలై 13(మనసులో మాట) :** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ తన ఖాతాదారులకు మరో శుభవార్త అందించింది. ప్రధాన డేటాబేస్ ఏకీకరణ, సాఫ్ట్‌వేర్ నవీకరణ పనుల కారణంగా గత రెండు వారాలుగా పరిమితంగా అందుబాటులో ఉన్న సేవలు ఇప్పుడు పూర్తిస్థాయిలో పునరుద్ధరించబడుతున్నాయి. ఈ సందర్భంగా పీఎఫ్ ఖాతా బదిలీ విధానాన్ని మరింత సులభతరం చేస్తూ సంస్థ కొత్త మార్పులను అమలు చేసింది. ఉద్యోగులు ఒక సంస్థ నుంచి మరో సంస్థకు మారినప్పుడు పీఎఫ్ ఖాతాలోని నిధులను బదిలీ చేసుకునే ప్రక్రియను సులభతరం చేయడానికి ఇకపై రెండు మార్గాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. గతంలో ఒకే విధానం ఉండగా, ఇప్పుడు మరో ప్రత్యామ్నాయాన్ని కూడా కల్పించింది. దీనివల్ల కాగితపు ప్రక్రియ తగ్గడంతో పాటు బదిలీ ప్రక్రియ వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంది. మొదటి విధానంలో ఉద్యోగులు పీఎఫ్ పోర్టల్‌లో తమ యూఏఎన్ సంఖ్య, సంకేత పదంతో ప్రవేశించి, మొబైల్‌కు వచ్చే ధ్రువీకరణ సంకేతాన్ని నమోదు చేయాలి. అనంతరం ఆన్‌లైన్ సేవల విభాగంలోకి వెళ్లి బదిలీ అభ్యర్థన ఎంపికను ఎంచుకోవాలి. అక్కడ గత సంస్థ సభ్యత్వ సంఖ్యను ఎంపిక చేసి వివరాలను పొందాలి. ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్‌కు వచ్చే ధ్రువీకరణ సంకేతాన్ని నమోదు చేసిన తర్వాత ప్రస్తుతం పనిచేస్తున్న సంస్థ వివరాలు కనిపిస్తాయి. వాటిని ఒకసారి పరిశీలించి అభ్యర్థనను సమర్పిస్తే బదిలీ ప్రక్రియ ప్రారంభమవుతుంది. రెండో విధానంలో పీఎఫ్ పోర్టల్‌లోకి ప్రవేశించిన తర్వాత సభ్య సేవల చరిత్ర విభాగాన్ని ఎంచుకోవాలి. అక్కడ ప్రస్తుతం పనిచేస్తున్న సంస్థతో పాటు గతంలో పనిచేసిన సంస్థల వివరాలు కనిపిస్తాయి. సంబంధిత ఎంపిక వద్ద ఉన్న అభ్యర్థన లింక్‌ను ఎంచుకుని ఫారం-13ను సమర్పించడం ద్వారా కూడా పీఎఫ్ నిధులను కొత్త సంస్థ ఖాతాకు బదిలీ చేసుకోవచ్చు. ఈ మార్పులతో ఉద్యోగులు ఉద్యోగం మారిన ప్రతిసారి పీఎఫ్ నిధుల బదిలీని మరింత వేగంగా, సులభంగా పూర్తి చేసుకునే అవకాశం

# ఐఫోన్ 17కు భారీ డిమాండ్

**న్యూఢిల్లీ, జూలై 13 (మనసులో మాట) :** భారత మార్కెట్‌లో యాపిల్ ఐఫోన్ 17 శ్రేణి స్మార్ట్‌ఫోన్లకు భారీ డిమాండ్ నెలకొంది. త్వరలో ధరలు పెరిగే అవకాశం ఉందనే అంచనాల నేపథ్యంలో వినియోగదారులు ముందుగానే కొనుగోళ్లకు మొగ్గు చూపుతుండటంతో పలు మోడళ్ల నిల్వలు వేగంగా ఖాళీ అవుతున్నాయి. గత కొన్ని రోజులుగా ఆన్‌లైన్ విక్రయ వేదికలతో పాటు ప్రత్యక్ష విక్రయ కేంద్రాల్లోనూ ఐఫోన్ 17 బేస్ మోడల్‌తో పాటు పలు రంగులు, నిల్వ సామర్థ్యాల రూపాంతరాలు అందుబాటులో లేకపోవడం గమనార్హం. మెమరీ చిప్‌ల తయారీ వ్యయం పెరగడం వల్ల కొన్ని ఉత్పత్తుల ధరలను సవరించాల్సి వస్తోందని యాపిల్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి టిమ్ కుక్ ఇటీవల సంకేతాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో సంస్థ ఇప్పటికే కొన్ని ట్యాబ్లెట్‌లు, కంప్యూటర్ల ధరలను పెంచింది. ప్రస్తుతం ఐఫోన్ 17 ధరల్లో ఎలాంటి మార్పు లేకపోయినా, సమీప భవిష్యత్తులో ధరలు పెరిగే అవకాశం ఉందనే ప్రచారం మార్కెట్‌లో వినిపిస్తోంది. దీంతో వినియోగదారులు ముందుగానే కొనుగోళ్లు పూర్తి చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధస్సు ఆధారిత డేటా కేంద్రాల అవసరాలు పెరగడంతో మెమరీ, నిల్వ చిప్‌లకు డిమాండ్ గణనీయంగా పెరిగింది. దీని ప్రభావంతో చిప్‌ల సరఫరాపై ఒత్తిడి ఏర్పడినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదే సమయంలో శాంసంగ్, ఒప్పో, వివో, రియల్‌మీ వంటి పలు స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థలు ఇప్పటికే తమ కొన్ని మోడళ్ల ధరలను పెంచాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఐఫోన్ 17 ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని భావిస్తున్న వినియోగదారులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న ధరలకే కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇదే సరైన సమయమని కొందరు విక్రయదారులు కూడా సూచిస్తున్నారు. అయితే ఐఫోన్ 17 ధరల పెంపుపై యాపిల్ సంస్థ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. మార్కెట్‌లో వినిపిస్తున్న అంచనాలు, ఊహాగానాలే ప్రస్తుతం ఐఫోన్ 17కు ఏర్పడిన కొరతకు ప్రధాన కారణంగా భావిస్తున్నారు.





# ఆరోగ్యాన్ని అందించే 'రైతు వారధి'

ఈ మధ్యకాలంలో మనం తినే ఆహార పదార్థాల్లో చాలావరకు కల్తీ అవుతున్నాయని వార్తలు వస్తున్నాయి. రోజుకో ప్రొడక్ట్ కల్తీ అని తెలుస్తోంటే.. గుండెల్లో గుబులు మొదలవుతోంది. ఎంతో ఇష్టంగా తినే ఫుడ్ కల్తీ కావడం వల్లే మన దేశంలో ఎంతోమంది అనారోగ్యం పాలవుతున్నారని నిపుణులు చెప్తున్నారు. అందుకే 'ఆరోగ్యమే మహాభాగ్యం' అని నమ్మిన ఒక యువరైతు ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించడానికి సిద్ధమయ్యాడు. తోటి రైతులకు స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. బీటెక్ చదివి తోటి రైతులకు సాగు పాఠాలు నేర్పుతున్న క్యాస మధు స్టోరీ ఇది.



జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం బతికేపల్లికి చెందిన మధు.. బీటెక్ అయిపోగానే కొంతకాలం ఉద్యోగం చేశాడు. తర్వాత ఉద్యోగం మానేసి తిరిగి ఇంటికి వెళ్లాడు. అప్పటి నుంచి ఆర్గానిక్ ఫార్మింగ్ గురించి రీసెర్చ్ చేశాడు. వ్యవసాయాధికారులు, రిటైర్డ్ ఉద్యోగుల సలహాలు, సూచనలు తీసుకునేవాడు. అంతేకాకుండా యూట్యూబ్‌లో వీడియోల్లో చూసి సేంద్రియ సాగులో మెళకువలు నేర్చుకునేవాడు. అలా ఇప్పుడు తను వాళ్ల పొలంలో పూర్తిగా సేంద్రియ వ్యవసాయం చేస్తున్నాడు. తనకున్న వ్యవసాయ భూమిలో సేంద్రియ సాగు మొదలుపెట్టాడు. అలా పండిన పంటలను సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా నేరుగా కస్టమర్లకు అమ్ముతున్నాడు. అందుకోసం 'రైతు వారధి'ని ఏర్పాటు చేశాడు. దీని ద్వారా రైతులకు, కస్టమర్లకు మధ్య దూరాన్ని తగ్గిస్తున్నాడు.సేంద్రియ పద్ధతిలో పండించిన పప్పుదినుసులు, పసుపు, కూరగాయలతోపాటు కారంపొడిని అమ్ముతున్నాడు. వీటితో పాటు గానుగ నూనె, పచ్చళ్లు కూడా హోమ్ డెలివరీ చేస్తున్నాడు.

ప్రస్తుతం దాదాపు70 శాతం మంది రైతులు దొడ్డు రకం బియ్యం పండిస్తుండగా, 30 శాతం మంది మాత్రమే సన్నరకాలు పండిస్తున్నారు. కానీ, సన్న రకాలకు ఎక్కువ డిమాండ్ ఉండడంతో కొందరు రైతులు ఎక్కువ దిగుబడి కోసం రసాయనాలు వాడుతున్నారు. అయితే, దానివల్ల అనారోగ్యాలు వస్తాయని మధు మిగతా రైతులకు అర్థమయ్యేలా వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నాడు.

### ఎలా మొదలైందంటే..

కొన్నేండ్ల నుంచి అధిక దిగుబడుల కోసం చాలామంది రైతులు విపరీతంగా రసాయనాలు వాడారు. ఇప్పటికీ వాడుతున్నారు. కానీ.. కరోనా వల్ల చాలామంది మంచిఫుడ్ తింటేనే ఆరోగ్యంగా ఉంటామని తెలుసుకున్నారు. ఆరోగ్యకరమైన పద్ధతుల్లో పండించిన ఫుడ్ తినేందుకు ఇష్టపడుతున్నారు. కానీ.. అలాంటి ఆహార ధాన్యాలు మార్కెట్‌లో సరిగ్గా దొరకడం లేదు. కొందరు రైతులు కష్టపడి సేంద్రియ పద్ధతుల్లో పండించినా అవి కస్టమర్ వరకు చేరేలోపే కల్తీ అవుతున్నాయి. అందుకే కెమికల్స్ లేని పంటలు పండించి, వాటిని నేరుగా కస్టమర్లకు చేర్చాలి అనే ఆలోచనతో మొదలైంది మధు ప్రయాణం.

"ప్రస్తుతం జగిత్యాల, కరీంనగర్, మంచిర్యాల, మహారాష్ట్ర ప్రాంతాల్లో ఈ సర్వీస్‌లు అందిస్తున్నాడు. సేంద్రియ వ్యవసాయంలో ఖర్చు చాలా తక్కువ. కానీ.. లాభాలు ఎక్కువగా వస్తాయి. పైగా సరైన పద్ధతుల్లో పండిస్తే దిగుబడి కూడా బాగానే వస్తోంది. సేంద్రియ ఉత్పత్తుల వల్ల రైతుతో పాటు ప్రజలు కూడా ఆరోగ్యంగా ఉంటారు" అని చెప్తున్నాడు మధు.








# ఇంగువ వల్ల ఎన్ని లాభాలో!

కొన్ని రకాల భారతీయ వంటల్లో ఇంగువ వాడడం సహజం. ముఖ్యంగా పులిహోర లాంటి వంటలకు ఇంగువ లేకపోతే రుచే లేదు. రుచితో పాటూ ఇంగువ అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుందని తెలుసా? ఇప్పుడు తెలుసుకుందాం.

ఇంగువలోని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు అంటువ్యాధులను నివారించడానికి ఉపయోగపడతాయి. ఏదైనా గాయం అయితే తొందరగా నయం చేయడానికి సాయపడతాయి.

ఒక అధ్యయనం ప్రకారం, ఇంగువను ఆయుర్వేద వైద్యంలో వివిధ ఆరోగ్య ప్రయోజనాల కోసం చాలాకాలంగా ఉపయోగిస్తున్నారు కూడా. ఇది జీర్ణశక్తిని పెంచుతుంది. దీనికున్న క్షార స్వభావం వల్ల కడుపులో అసిడిటీని, యాసిడ్ రిఫ్లక్స్‌ను తగ్గిస్తుంది.

### ఆడవాళ్లకు ఇలా..

ఫేస్ ప్యాక్స్ లో చిటికెడు ఇంగువ వేసుకుని ముఖానికి రాసుకుంటే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.ఇంగువలోని రోగ నిరోధక లక్షణాలు నెలసరి సమయంలో వచ్చే నొప్పులు, ఇతర పిఎంఎస్ లక్షణాల నుండి ఉపశమనం ఇవ్వడానికి సాయం చేస్తాయి. పీరియడ్స్ సమయంలో అధిక రక్తస్రావం కాకుండా కంట్రోల్ చేస్తుంది.

# ఎవర్‌గ్రీన్ కాంబినేషన్

వర్షం కురిసే వేళ... వేడిగా పొగలు కక్కుతున్న టీ ఉంటే... అద్భుతః అనిపిస్తుంది. ఈ ఎవర్‌గ్రీన్ కాంబినేషన్ మాన్‌సూన్‌లో తప్పక ట్రై చేయాల్సిందే. కానీ, ఇందులో స్పెషాలిటీ ఏంటంటే... మామూలు టీ కాదు అల్లం, పుదీనా, తులసి వంటి వాటితో టీ పెట్టుకుని తాగితే.. వానాకాలంలో వేధించే దగ్గు, జలుబు, తలనొప్పి, ముక్కుదిబ్బడ, గొంతులో గరగర వంటి సమస్యలన్నింటికి చెక్ పెట్టొచ్చు. మరింకేం.. ఈ టీలు ఎలా తయారుచేసుకోవాలో తెలుసుకుందామా



### అల్లం టీ

**కావాల్సిన పదార్థాలు:**

అల్లం – ఒక టీస్పూన్
తేనె – రెండు స్పూన్లు
లవంగాలు – రెండు
దాల్చిన చెక్క – 1అంగుళం
నీళ్లు – ఒక కప్పు



**తయారీ విధానం:**

ఒక గిన్నెలో ఒక కప్పు నీళ్లు పోసి మరిగించాలి. తర్వాత అందులో అల్లం, తేనె, లవంగాలు, దాల్చిన చెక్కలను వేయాలి. ఆ నీటిని పావుగంట పాటు పక్కన పెట్టాలి. ఆపై ఒక కప్పులో టీని వడకట్టి ఈ గోరువెచ్చగా తాగాలి.

### తులసి టీ

**కావాల్సిన పదార్థాలు:**

తులసి ఆకులు – పావు కప్పు
తేనె – ఒక టీస్పూన్
నిమ్మరసం – రెండు టీస్పూన్లు
నీళ్లు – పావు కప్పు



**తయారీ విధానం:**

ఒక గిన్నెలో నీళ్లు పోసి అందులో తులసి ఆకులు వేసి మరిగించాలి. ఆ తర్వాత ఈ నీటిని ఒక కప్పులో వడకట్టాలి. ఆపై తేనె, నిమ్మరసం కలుపుకొని గోరువెచ్చగా ఉన్నప్పుడే ఆస్వాదిస్తే.. ఆ అనుభూతే వేరు.

### పుదీనా టీ

**కావాల్సిన పదార్థాలు:**

పుదీనా ఆకులు – కొన్ని
రోజ్‌మేరీ రెమ్మ – ఒకటి
నిమ్మరసం – రుచికి సరిపడా
నీళ్లు – ఒక కప్పు



**తయారీ విధానం:**

ముందుగా ఒక గిన్నెలో నీళ్లు పోసి మరించాలి. అందులో రోజ్‌మేరీ వేసి ఉడికించాలి. మరోవైపు ఒక కప్పులో పుదీనా ఆకులను వేయాలి. ఆ తర్వాత రోజ్‌మేరీ మిశ్రమాన్ని పుదీనా ఆకులు ఉన్న కప్పులో పోయాలి. పది నిమిషా అలాగే ఉంచి.. చివరగా నిమ్మరసం వేసుకుని తాగితే.. టేస్ట్ బాగుంటుంది

# టీజీ20 లీగ్ తొలి ఛాంపియన్‌గా హైదరాబాద్ ఈ ఛాంపియన్స్



**హైదరాబాద్, జూలై 13 (మనసులో మాట) :** తెలంగాణ యువ క్రికెటర్ల ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన తొలి టీజీ20 లీగ్‌లో హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ జట్టు చరిత్ర సృష్టించింది. ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన ఈ ఫ్రాంఛైజీ ఫైనల్లో ఖమ్మం ఏసెస్‌పై 6 వికెట్ల తేడాతో విజయం సాధించి తొలి సీజన్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమిష్టి ప్రదర్శనతో హైదరాబాద్ జట్టు ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం చెలాయించింది. టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్న హైదరాబాద్ కెప్టెన్ అభిరథ్ రెడ్డి నిర్ణయాన్ని బౌలర్లు సమర్థించారు. యశ్వీర్ గౌడ్ మూడు వికెట్లు పడగొట్టి ఖమ్మం బ్యాటింగ్‌ను దెబ్బతీయగా, దేవ్ మెహతా రెండు, అజయ్‌దేవ్ గౌడ్ రెండు వికెట్లు తీసి ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టారు. ఒక దశలో 33 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన ఖమ్మం జట్టును మికిల్ జైస్వాల్ 65 పరుగులతో ఆదుకున్నాడు. హిమతేజతో కలిసి 94 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పినా, చివరి ఓవర్లలో హైదరాబాద్ బౌలర్లు మళ్లీ పుంజుకోవడంతో ఖమ్మం ఏసెస్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 157 పరుగులు మాత్రమే చేసింది. 158 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ జట్టుకు షణ్ముఖ అశ్విన్ 36, కెప్టెన్ అభిరథ్ రెడ్డి 48 పరుగులతో మంచి పునాది వేశారు. అనంతరం వైష్ణవ్ రెడ్డి 41 పరుగులతో అజేయంగా నిలిచి వేగంగా పరుగులు రాబట్టాడు. ప్రణవ్ వర్మ 19 పరుగులతో అండగా నిలవడంతో హైదరాబాద్ జట్టు 17.3 ఓవర్లలోనే నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి విజయాన్ని ఖాయం చేసింది. టోర్నీ విజేత హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ జట్టుకు రూ.1 కోటి నగదు బహుమతి అందగా, రన్నరప్ ఖమ్మం ఏసెస్‌కు రూ.50 లక్షలు లభించాయి. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా విజేతలకు ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, డీజీపీ సి.వి. ఆనంద్, లీగ్ బ్రాండ్ అంబాసిడర్ విజయ్ దేవరకొండ, రామోజీ గ్రూప్ సంస్థల సీఎండీ సీహెచ్ కిరణ్, మార్గదర్శి ఎండీ సీహెచ్ శైలజాకిరణ్ తదితరులు పాల్గొన్నారు. టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన అభిరథ్ రెడ్డి ఆరెంజ్ క్యాప్‌ను, అత్యధిక వికెట్లు పడగొట్టిన అజయ్‌దేవ్ గౌడ్ పర్పుల్ క్యాప్‌ను సొంతం చేసుకున్నారు.

## వార్ నిర్ణయంతో స్విస్‌కు షాక్


### సెమీస్‌లోకి అర్జెంటీనా

**కాన్సాస్ సిటీ, జూలై 13 (మనసులో మాట) :** ప్రపంచకప్ ఫుట్‌బాల్‌లో సంచలనాత్మక పరిణామం చోటుచేసుకుంది. అర్జెంటీనా–స్విట్జర్లాండ్ మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో వీడియో అసిస్టెంట్ రెఫరీ (వార్) నిర్ణయం తీవ్ర వివాదానికి దారితీసింది. స్విట్జర్లాండ్ స్టార్ ఫార్వర్డ్ బ్రీల్ ఎంబోలో రెండో ఎల్లో కార్డు కారణంగా రెడ్ కార్డు పొంది మైదానం వీడాల్సి రావడంతో స్విస్ జట్టు గెలుపు అవకాశాలు దెబ్బతిన్నాయి. అదనపు సమయంలో రెండు గోల్స్ సాధించిన అర్జెంటీనా 3–1 తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. మ్యాచ్ 72వ నిమిషంలో బ్రీల్ ఎంబోలో బంతితో ముందుకు దూసుకెళ్తుండగా అర్జెంటీనా ఆటగాడు లియాండ్రో పరేడెస్ అడ్డుకునే ప్రయత్నం చేశాడు. ఎంబోలో కిందపడటంతో తొలుత పరేడెస్‌కు ఎల్లో కార్డు చూపించిన రెఫరీ, అనంతరం వార్ సాయంతో నిర్ణయాన్ని పునఃసమీక్షించారు. రీప్లేలో ఎంబోలో ఉద్దేశపూర్వకంగానే ఫౌల్ జరిగినట్లు నటించినట్లు తేలడంతో పరేడెస్‌కు ఇచ్చిన ఎల్లో కార్డును రద్దు చేసి, ఎంబోలోకు ఎల్లో కార్డు విధించారు. అది అతనికి రెండో ఎల్లో కార్డు కావడంతో రెడ్ కార్డుగా మారి మైదానం వీడాల్సి వచ్చింది. ప్రపంచకప్ చరిత్రలో ఫౌల్ కోసం నటించిన కారణంగా రెండో ఎల్లో కార్డుతో ఆటగాడు నిష్క్రమించడం రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ చోటుచేసుకోవడం విశేషం. మ్యాచ్ 67వ నిమిషంలో డాన్ న్డోయే గోల్‌తో



స్విట్జర్లాండ్ స్కోరును 1–1తో సమం చేసింది. అయితే ఎంబోలో నిష్క్రమించిన తర్వాత పది మంది ఆటగాళ్లతోనే మ్యాచ్ కొనసాగించాల్సి రావడంతో స్విస్ జట్టు రక్షణాత్మక ఆటకు పరిమితమైంది. నిర్ణీత సమయంలో స్కోరు సమంగా ఉండటంతో మ్యాచ్ అదనపు సమయానికి వెళ్లింది. అదనపు సమయంలో అర్జెంటీనా తరఫున జూలియన్ అల్వారెజ్ 112వ నిమిషంలో, లౌటారో మార్టినెజ్ 120వ నిమిషంలో గోల్స్ సాధించి జట్టుకు 3–1 విజయాన్ని అందించారు. దీంతో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్‌తో తలపడనుంది. మ్యాచ్ అనంతరం స్విట్జర్లాండ్ ప్రధాన కోచ్ మురత్ యాకిన్ వార్ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక్క నిర్ణయమే మ్యాచ్ ఫలితాన్ని మార్చేసిందని, ఇలాంటి తీర్పులు ఆమోదయోగ్యం కావని వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై ఫుట్‌బాల్ వర్గాల్లో విస్తృత చర్చ కొనసాగుతోంది.

## టీమిండియా వైఫల్యాలకు కోచ్, కెప్టెన్ కారణం కాదు



**ముంబై, జులై 13(మనసులో మాట) :** ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో భారత జట్టు 0–4 తేడాతో వైట్‌వాష్‌కు గురికావడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతకుముందు ఐర్లాండ్‌తో జరిగిన సిరీస్‌ను కూడా 0–2తో కోల్పోయిన నేపథ్యంలో జట్టులో భారీ మార్పులు చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. అయితే భారత మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ మాత్రం ఈ వైఫల్యాలకు కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌లను బాధ్యులను చేయడం సరైన పరిష్కారం కాదని అభిప్రాయపడ్డాడు. భారత క్రికెట్ వ్యవస్థలోని లోపాలే ప్రస్తుత పరిస్థితికి కారణమని మంజ్రేకర్ పేర్కొన్నాడు. ఐపీఎల్‌లో బ్యాటింగ్‌కు పూర్తిగా అనుకూలమైన పిచ్‌లపై ఆటగాళ్లు భారీ పరుగులు చేయడం వల్ల వారి అసలు సామర్థ్యాన్ని అంచనా వేయడం కష్టమవుతోందని వ్యాఖ్యానించాడు. ఐపీఎల్ గణాంకాలను చూసి సెలక్టర్లు భ్రమపడుతున్నారని, అవి ఆటగాళ్ల ప్రతిభపై ఒక రకంగా 'మేకప్' వేసినట్లుగా మారాయని విశ్లేషించాడు. వాణిజ్య ప్రయోజనాల కోసం బ్యాటర్లకు అనుకూలంగా నిబంధనలు రూపొందించిన వారిపైనే బాధ్యత వేయాలని సూచించాడు. ఇంగ్లండ్‌తో జరిగిన నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా ప్రదర్శన తీవ్ర నిరాశ కలిగించింది. ఒక మ్యాచ్‌లో కేవలం 76 పరుగులకే ఆలౌట్ కాగా, మరో మ్యాచ్‌లో ఇంగ్లండ్ 257 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. పూర్తిస్థాయి కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్‌కు ఇది తొలి సిరీస్ కాగా, అతని నాయకత్వంలో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లోనూ భారత్ విజయాన్ని నమోదు చేయలేకపోయింది. టీ20 ప్రపంచకప్ విజయం అనంతరం ప్రధాన కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన గౌతమ్ గంభీర్‌కు ఈ వరుస పరాజయాలు గట్టి ఎదురుదెబ్బగా మారాయి. మరోవైపు ఈ సిరీస్ విజయంతో ఇంగ్లండ్ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని అధిరోహించగా, భారత్ వెనుకబడింది. ప్రస్తుతం భారత జట్టు ప్రదర్శనపై క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది.

## ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు గిల్ నామినేషన్

**దుబాయ్, జులై 13(మనసులో మాట) :** జూన్ నెలకు గానూ ఐసీసీ ప్రకటించిన పురుషుల 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డు నామినేషన్లలో భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ చోటు దక్కించుకున్నాడు. జూన్ నెలలో టెస్టు, వన్డే ఫార్మాట్లలో అద్భుత ప్రదర్శన కనబర్చిన గిల్‌తో పాటు బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మొసద్దెక్ హుస్సేన్, న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ నాథన్ స్మిత్ కూడా ఈ అవార్డు కోసం పోటీలో ఉన్నారని ఐసీసీ ప్రకటించింది. ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన సిరీస్‌లో గిల్ బ్యాట్‌తో చెలరేగాడు. న్యూ చండీగఢ్‌లో జరిగిన ఏకైక టెస్టులో 126 పరుగులు చేసి భారత్ ఇన్నింగ్స్ విజయానికి బాటలు వేశాడు. అనంతరం వన్డే సిరీస్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనే 238 పరుగులు సాధించి తన అద్భుత ఫామ్‌ను కొనసాగించాడు. తొలి వన్డేలో 66 బంతుల్లో 84 పరుగులు చేసిన గిల్, రెండో వన్డేలో కాళ్ల నొప్పితో బాధపడుతూనే 110 బంతుల్లో 154 పరుగులతో అజేయ శతకం నమోదు చేశాడు. ఈ ప్రదర్శనతో మ్యాచ్‌తో పాటు సిరీస్‌లోనూ అత్యుత్తమ ఆటగాడిగా ఎంపికై, భారత్ 3–0తో సిరీస్‌ను కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. మరోవైపు, నాలుగేళ్ల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగి వచ్చిన బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మొసద్దెక్ హుస్సేన్ ఆస్ట్రేలియాపై తన జట్టుకు చారిత్రాత్మక 2–1 వన్డే సిరీస్ విజయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించాడు. అలాగే న్యూజిలాండ్ పేసర్ నాథన్ స్మిత్ ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో 16 వికెట్లు పడగొట్టి జట్టుకు 2–1తో సిరీస్ విజయం అందించాడు. ఈ ముగ్గురిలో జూన్ నెల అత్యుత్తమ ఆటగాడిగా ఎవరు నిలుస్తారో త్వరలో ఐసీసీ ప్రకటించనుంది.





## చెన్నై సూపర్ కింగ్స్‌కు గుడ్‌బై చెప్పిన ఫ్లెమింగ్

### కొత్త కోచ్‌గా హేమంగ్ బదానీ?

**న్యూఢిల్లీ, జులై 13 (మనసులో మాట) :** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్‌కు కీలక మార్పులు చోటుచేసుకోనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దాదాపు 18 ఏళ్లుగా జట్టుతో అనుబంధం కొనసాగించిన ప్రధాన కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ కోచింగ్ బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు సమాచారం. దీంతో కొత్త ప్రధాన కోచ్ నియామకంపై చెన్నై యాజమాన్యం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న మేజర్ లీగ్ క్రికెట్‌లో టెక్సాస్ సూపర్ కింగ్స్‌తో ఉన్న చెన్నై ఫ్రాంచైజీ ప్రతినిధులు కోచింగ్ విభాగంలో మార్పులపై చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో భారత మాజీ క్రికెటర్, ప్రస్తుతం ఢిల్లీ క్యాపిటల్స్ కోచ్‌గా ఉన్న హేమంగ్ బదానీ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఆయనతో ఇప్పటికే ప్రాథమిక చర్చలు జరిగినట్లు ప్రచారం సాగుతోంది. ఈ విషయంపై సీఎస్‌కే క్రికెట్ లిమిటెడ్ డైరెక్టర్ రూపా గురునాథ్ స్పందిస్తూ, కోచింగ్ బృందంలో మార్పులపై అంతర్గతంగా చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తామని తెలిపారు. స్టీఫెన్ ఫ్లెమింగ్ రెండు దశాబ్దాల పాటు జట్టుకు విశేష సేవలందించి చెన్నై విజయాల్లో కీలక పాత్ర పోషించారని ఆమె కొనియాడారు. స్టీఫెన్ ఫ్లెమింగ్ 2008లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆటగాడిగా చేరి, 2009 నుంచి ప్రధాన కోచ్‌గా బాధ్యతలు స్వీకరించారు. 2016, 2017లో చెన్నై జట్టుపై నిషేధం అమల్లో ఉన్న సమయంలో రైజింగ్ పూణే సూపర్‌జెయింట్స్‌కు కోచ్‌గా వ్యవహరించి ఆ జట్టును ఫైనల్‌కు చేర్చారు. ఆయన కోచ్‌గా ఉన్న కాలంలో చెన్నై సూపర్ కింగ్స్ 11 సార్లు ఫైనల్‌కు చేరగా, అందులో 10 సార్లు ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఫైనల్, ఒకసారి ఛాంపియన్స్ లీగ్ ఫైనల్ ఆడింది. అలాగే ఆరు ప్రధాన టైటిళ్లను సొంతం చేసుకుని లీగ్‌లో అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటిగా నిలిచింది. ప్రస్తుతం హేమంగ్ బదానీ ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపడతారా లేదా అనే విషయంపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## ద్రవిడ్‌కు ఇంగ్లండ్ కోచ్ అవకాశం?

### రేసులో 'ది వాల్' పేరు..

**లండన్, జులై 13 (మనసులో మాట) :** ఇంగ్లండ్ పురుషుల టెస్ట్ జట్టు ప్రధాన కోచ్ పదవి నుంచి బ్రెండన్ మెక్‌కల్లమ్ తప్పుకోవడంతో ఆ బాధ్యతలను ఎవరు చేపడతారన్న అంశంపై ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో భారత మాజీ ప్రధాన కోచ్, దిగ్గజ బ్యాటర్ రాహుల్ ద్రవిడ్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నట్లు అంతర్జాతీయ క్రికెట్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. భారత జట్టును విజయవంతంగా నడిపించిన అనుభవం, యువ ఆటగాళ్లను తీర్చిదిద్దడంలో ఆయనకు ఉన్న ప్రత్యేక గుర్తింపు ద్రవిడ్‌ను బలమైన అభ్యర్థిగా నిలబెడుతున్నట్లు తెలుస్తోంది. అయితే పూర్తి స్థాయి కోచింగ్ బాధ్యతలు స్వీకరించేందుకు ద్రవిడ్ అంతగా ఆసక్తి చూపడం లేదని సమాచారం. నిరంతర పర్యటనలు, కుటుంబానికి దూరంగా ఉండాల్సిన పరిస్థితులు వంటి కారణాల వల్ల ఆయన ఈ అవకాశాన్ని తిరస్కరించే అవకాశాలు ఉన్నాయని క్రికెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదిలా ఉండగా, ఈ పదవి కోసం జింబాబ్వే మాజీ దిగ్గజం ఆండీ ఫ్లవర్, ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ రిచర్డ్ డాసన్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో భారత సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌తో కూడా ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు ప్రతినిధులు క్రికెట్ వ్యూహాలపై చర్చలు జరిపినట్లు ప్రచారం సాగుతోంది. అయితే ద్రవిడ్ నియామకంపై ఇప్పటివరకు ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో ప్రస్తుతం వినిపిస్తున్న వార్తలు కేవలం ప్రచారంగానే భావించాల్సి ఉంది. త్వరలోనే కొత్త ప్రధాన కోచ్‌పై తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in SHOBHA PUBLICATION'S